# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
శనివారం
08.11. 2025

సంపుటి : 16 సంచిక: 41
పేజీలు: 8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## క్రూరత్వానికి చిరునామా కుంభ

మహేష్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రానికి సంబంధించిన భారీ ఈవెంట్ ఈ నెల 15న హైదరాబాద్‌లో జరగబోతున్న విషయం తెలిసిందే. ఇదే వేదికపై దర్శకుడు రాజమౌళి సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేస్తారని ప్రచారం జరుగుతున్నది. ఈవెంట్‌కు ముందుగానే దర్శకధీరుడు ఈ సినిమాకు సంబంధించి సర్‌ప్రైజ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఇందులో మలయాళ అగ్ర నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం కుంభ అనే పాత్రలో ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. హైటెక్ వీల్‌చైర్‌లో కూర్చొని న్యూఏజ్ విలన్‌గా ఆయన లుక్ ఆకట్టుకుంటున్నది.

## పోలీసు సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలి



- భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు
- లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ

**చట్టం, భద్రాద్రి కొత్తగూడెం:**

పోలీసుల సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.పోలీస్ అధికారులు,సిబ్బంది వృత్తిపరమైన, వ్యక్తిగత సమస్యలను ఎలాంటివి తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రమణారెడ్డి, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



## రైతులకు సాగుకు నీటిని అందించేలా చర్యలు

**చట్టం, స్టేషన్ ఘనపూర్**

గండి రామారం పంపు హౌస్ ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు.శుక్రవారం చిల్పూర్ మండలంలోని గండిరామారం పంపు హౌస్‌ను సందర్శించి ఎత్తిపోతల పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనిచేస్తున్న ఇంజనీర్లు,అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సూచించారు.రైతుల సాగుకు నీటిని అందించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ఎత్తిపోతల పథకం ద్వారా వేల ఎకరాల భూమికి నీటి సదుపాయం లభించబోతోందని,ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టును సమయానికి పూర్తి చేసి వ్యవసాయ రంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని స్పష్టం చేశారు. గండి రమారం రిజర్వాయర్‌లో చేప పిల్లల వదిలిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి గండి రమారం రిజర్వాయర్‌లో చేప పిల్లల వదిలి ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది.ఈ రిజర్వాయర్ ద్వారా ఏటా సుమారు నాలుగు వందల టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతుంది.దాదాపు నాలుగు కోట్ల రూపాయల విలువైన చేపలు మార్కెట్లోకి వస్తున్నాయి అని తెలిపారు.మత్స్యకారుల ఆదాయం పెరగడం కోసం చేపలను పెంచడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు, రవాణా సౌకర్యాలు కల్పించేలా అధికారులను సూచించినట్టు తెలిపారు.ప్రస్తుతం రిజర్వాయర్ పరిధిలో 319 మహిళా సంఘాల సభ్యులు,700 మంది మత్స్యకార సంఘ సభ్యులు, మరో 300 మంది సభ్యత్వం కోసం అప్లై చేసుకున్నారని మొత్తం 1300 మంది మత్స్యకారులు నెలకు పదివేల రూపాయలకు పైగా సంపాదించే స్థాయికి చేరుకోవడం సంతోషకరమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఆగస్టు నెలలో చేప పిల్లలను వదిలే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి, చేపల ఉత్పత్తి పెరిగేలా చర్యలు తీసుకుంటాం అని అన్నారు. నియోజకవర్గంలోని ముదిరాజుల ఆర్థిక అభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అలాగే ఘనపూర్ పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 50 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్టు తెలిపారు. అందులో నాలుగు కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా, ఆర్డీ ఓ వెంకన్న, జిల్లా మత్స్య శాఖ అధికారి రానా ప్రతాప్, డీపీవో, తహసీల్దార్ జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యక్షులు, సొసైటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'గన్'గ్యాంగ్ అరెస్ట్..



- ప్రధాన నిందితుడు సూరి..
- అతనిపై 45 క్రిమినల్ కేసులు, 3 పీడీ యాక్ట్ కేసులు
- బిహార్‌లో తుపాకులు కొనుగోలు చేసిన ముఠా
- వివరాలు వెల్లడించిన డీసీపీ అంకిత్ కుమార్

**చట్టం, వరంగల్:**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల తుపాకుల కలకలం కేసుల్లో నిందితులైన సూరి అలియాస్ సురేందర్ గ్యాంగ్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పోలీస్ కమిషనరేట్ లో ఈస్ట్ జోన్ డీసీపీ అంకితకుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సూరి గ్యాంగ్ అరెస్ట్ కు సంబందించిన వివరాలను వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సెప్టెంబర్ 18న సూరి అలియాస్ సురేందర్ గ్యాంగ్ శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పరకాల హనుమకొండ ప్రధాన రహదారిపై ఓ లారీని ఆపి డ్రైవర్ ను తుపాకీతో బెదిరించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సమీపంలోని పెట్రోల్ బంకులో పెట్రోల్కొ ట్టించుకుని డబ్బు ఇవ్వకుండా నిర్వాహకులను బెదిరించారు. ఈ రెండు కేసుల్లో సూరితో పాటు మరో ఎడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు హైదరాబాద్ కు చెందిన సూరి అలియాస్ సురేందర్ గా పోలీసులు నిర్ధారించారు. అతనిపై 45 క్రిమినల్ కేసులు, 3 పీడీ యాక్ట్ కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. నాలుగు నెలల నుంచి అతడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలోనే అక్కడ కొంతమంది విద్యార్థులను చేరదీసి గ్యాంగ్ గా ఏర్పాడి దోపిడీలకు పాల్పడుతున్నాడు. సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఆ ముఠా కోసం పోలీసులు గాలించారు. గురువారం రౌడీ షీటర్ సూరి, గ్యాంగ్ ను అదుపులోకి తీసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ నుంచి రౌడీషీటర్ సూరి బహిష్కరణకు గురయ్యాడు. కాగా అతడు చర్లపల్లి జైల్లో ఉన్నప్పుడు బీహార్ కు చెందిన ఠాకూర్ తో పరిచయం అయింది. బీహార్ నుండి రెండు షార్ట్ వెపన్స్(తుపాకులు) కొనుగోలు చేశాడు. వరంగల్ అడ్డాగా క్రిమినల్ యాక్టివిటీస్ చేసేందుకు ప్రయత్నించాడు. భూపాలపల్లిలో పలువురిని హతమార్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. సూరి గ్యాంగ్ చేయబోయే నేరాలను ముందే అడ్డుకున్నట్లు డీసీపీ అంకిత్ కుమార్ తెలిపారు. సమావేశం లో పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఖని'లో మైసమ్మ పోచమ్మ గుల్ల కూల్చివేతపై ఆందోళన నిరసనలు



- హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో
- రామగుండం ప్రజలకు ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణ చెప్పాలి
- దారి మైసమ్మ పోచమ్మ గుళ్ళ పున నిర్మాణం చేపట్టాలి
- మైసమ్మ గుళ్లను కూల్చివేసిన అధికారులను సస్పెండ్ చేయాలి హిందూ ఐక్యవేదిక డిమాండ్

**చట్టం రామగుండం :**

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో అర్ధరాత్రి తర్వాత రోడ్లిబవధుల్లోని పోచమ్మ, వేలుపమ్మ, మైసమ్మ గుళ్లను —— రామగుండం ఎమ్మెల్యే ఆదేశంతో అధికారులు కూల్చి వాటి విగ్రహాలను చెత్త ట్రాక్టర్లలో పడేసి పారితక కేసుల్లో విసారమైనట్లు ఉండటం పై హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఆందోళన ప్రకటించాయి. శుక్రవారం పోచమ్మ గుడి ఆవరణలో జరిగిన సమావేశంలో బిజెపి, బిఆర్ఎస్, బిఎంఎస్, టిడిపి, విశ్వహిందూ పరిషత్, కార్మిక సంఘాలు మరియు స్థానిక స్వచ్ఛంద సంఘాల నాయకులు వినిపి ఈ చర్యను హేతూహీనంగా, ప్రజల భావోద్వేగాలపై దెబ్బతీసే విధంగా తీవ్రంగా మండిపడ్డారు. వారు మైసమ్మ, పోచమ్మ, వేలుపమ్మ వంటి గ్రామీణ అమ్మవారి దేవాలయాలను కూల్చివేత మూలంగా ప్రజల్లో భయం, ఆగ్రహం పుట్టవచ్చని హెచ్చరించారు. నాయకులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాలపై అధికారులను సంయమనం పాటించాల్సినదిగా, ఈ ప్రతికూల చర్యకు పాల్పడిన అధికారులను సస్పెండ్ చేసి కోల్పోయిన గుళ్లను పునర్నిర్మించాలనీ, ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసి ప్రజలకు పబ్లిక్‌గా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చెయ్యగా, పడిన అనతిక్రమణను సమన్వయం చేసి ఇల్లులైన సమాధానాలు కోరారు. సమావేశం అనంతరం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు నిరసన నిర్వహించి, టీజంక్షన్ వద్ద ధర్నా, మునిసిపల్ కార్యాలయం ముందు ఆందోళనలు చేశారు.

## బీజేపీలో జూబ్లీహిల్స్ లొల్లి



- జూబ్లీహిల్స్ ఉపపోరు చివరి అంకానికి చేరుకుంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రచారాన్ని హోరెక్కించాయి
- బీజేపీ అభ్యర్థి కాస్త నెమ్మదిగా ఉన్నారనే టాక్
- ఈ నేపథ్యంలో ఎంపీ అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు
- ప్రచారానికి రాలేదని ఫిర్యాదు చేయొద్దు అన్నారు
- ఈ మేరకు రామచంద్ర రావు గారికి విజ్ఞప్తి చేస్తున్నా

**చట్టం, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉపపోరులో ప్రచారం చివరి అంకానికి చేరుకుంది. దీంతో, ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ తమ ప్రచారాన్ని మరింత హోరెక్కించాయి. పోటాపోటీగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీంతో, హస్తం పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత మధ్య ప్రచార పోరు 'నువ్వానేనా' అన్నట్టుగా సాగుతోంది. అయితే, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ప్రచారం విషయంలో కాస్త నెమ్మదిగా కనిపిస్తున్నారంటూ మొదటి నుంచి టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీకి సంబంధించి ఒక ఆసక్తికర అంతర్గత వ్యవహారం బయటకు వచ్చింది.

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం వేళ బీజేపీలో విభేదాలు చోటుచేసుకున్నాయా? అనే సందేహం కలిగే పరిణామం ఒకటి శుక్రవారం చోటుచేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడురాం చందర్ రావును ఉద్దేశించి నిజామాబాద్ ఎంపీ అరవింద్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్‌లో తాను ప్రచారం నిర్వహించడం లేదంటూ వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, జూబ్లీహిల్స్ చేసే ప్రచారం కంటే, సోషల్ మీడియా వేదికగా తానే ఎక్కువ ప్రచారం చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ప్రచారానికి రాలేదని అధిష్టానానికి ఫిర్యాదు చేయొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ''నా సోషల్ మీడియా బలంతో చేస్తున్న ప్రచారం, మీరు జూబ్లీహిల్‌స్‌లో ఫిజికల్‌గా చేస్తున్న ప్రచారం కంటే ఎక్కువ. వారు చేస్తున్నదానికంటే ఎక్కువగానే ఉంది. రాంచందర్ రావు గారూ, నేను ప్రచారం చేయడం లేదంటూ అధిష్టానికి ఫిర్యాదు చేయకండి'' అని అరవింద్ పేర్కొన్నారు.జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం అక్కడ చేసే వాళ్ల కంటే తాను ఎక్కువ చేస్తున్నానని ఎంపీ అరవింద్ పునరుద్ఘాటించారు. ''మీరు మాట్లాడిన మాటలకు, నా ఒక్క సోషల్ మీడియా ప్రచారం ఎక్కువ. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం నేనూ చేస్తున్నాను. ఇంధూరుకి వచ్చినా ఇక్కడి నుంచి ప్రచారం చేస్తున్నా. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు.. నా మీద కంప్లైంట్స్ చేయకండి'' అని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ బీజేపీ పెద్ద స్థాయిలో ఉందని, తాను ఈ విషయాన్ని గొప్పగా చెప్పుకుంటానన్నారు. దానికి సాక్ష్యం ఆర్మూర్ ఎంఎల్ఏ రాకేష్ రెడ్డి అంటూ అరవింద్ పేర్కొన్నారు. తాము గ్రామస్తులమని, పల్లెల్లో తిరుగుతూ ఉంటామని పేర్కొన్నారు. జూబ్లీహిల్‌స్‌లో నాయకులున్నారని, సీనియర్ నేతలు, ఎంపీలు, మంత్రులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ప్రచారాన్ని వారు చూసుకుంటారని అరవింద్ చెప్పారు. కాగా, జూబ్లీహిల్స్ ప్రచారం విషయంలో ఆరంభంలో వెనుకబడినట్టు కనిపించిన బీజేపీ గత నాలుగైదు రోజుల్లో బాగా పుంజుకుంది. తమ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కేంద్ర మంత్రులు, రాష్ట్ర అధ్యక్షుడు వంటి కీలక నాయకులు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఇక నిజామాబాద్‌లో పార్టీ బలంగా ఉందని.. ఆ విషయాన్ని అందరూ గమనించాలని సూచించారు. ఎంపీ అర్వింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఒక అసమర్థ ముఖ్యమంత్రి అని ఆరోపించిన అర్వింద్.. ఆయన కేసీఆర్‌తో ములాఖత్ అయ్యారని సంచలన ఆరోపణ చేశారు. రెండు పార్టీలు కూడా ఒక్కటే అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో లెక్కలేనన్ని పాపాలు చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి లక్ష కోట్ల రూపాయలు ముంచేసి.. తెలంగాణను అప్పులపాలు చేశారని దుమ్మెత్తిపోశారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు, రియల్ ఎస్టేట్ స్కామ్ వంటి ఎన్నో కీలక కేసుల్లో రేవంత్ సర్కారు ముందుకు వెళ్లలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. నిజామాబాద్ మార్కెట్ యార్డు ఆదాయాన్ని సైతం కేసీఆర్ తన హయాంలో సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకే తరలించారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి విజయం సాధిస్తే.. ఈ కేసులపై దర్యాప్తు వేగవంతం అవుతుందని.. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడతాయని బీజేపీ శ్రేణులు ఆశిస్తున్నాయి.

## కలెక్టరేట్ లో ఘనంగా సామూహిక వందేమాతరం గేయాలాపన వేడుక

- పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు

**చట్టం, నిర్మల్**

కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జాతీయ గేయం వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఉదయం సామూహిక వందేమాతరం ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. మొదటగా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర సంగ్రామంలో వందేమాతరం గేయం ఎంతోమంది సమరయోధుల్లో స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షను రగిలించడంలో కీలక భూమిక పోషించిందని అన్నారు. బంకించంద్ర చటర్జీ, 1875 నవంబర్ 07 న జాతీయ గేయం వందేమాతరం రచించడం జరిగిందని వివరించారు. జాతీయ గేయం, జాతీయ గీతం భారతదేశ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడంలో నేటికీ కీలక భూమిక పోషిస్తున్నాయని వివరించారు. ఈరోజు వందేమాతరం ఆలాపన కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించడం ఎంతో గర్వించదగ్గ విషయమని చెప్పారు. ప్రజలంతా దేశభక్తి, దేశంపై గౌరవం కలిగి ఉండాలని అన్నారు. జాతీయ గేయం స్పూర్తితో అధికారులంతా ఉన్నత భావాలను కలిగివుండి, దేశాభివృద్ధిలో నిరంతరం తోడ్పాటును అందించాలని తెలిపారు.



# ఈ నెల 10 న వికలాంగులు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

- వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలనే
- జీవో 34 ను తక్షణమే అమలు చేయాలి
- 3 ఏండ్లు గడిచిన అమలుకు నోచుకోని జీవో
- వికలాంగుల సంఘం నాయకులు కొన్నింటి నర్సింలు



**చట్టం న్యూస్ జహీరాబాద్:** వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలనే జీవో 34 ను తక్షణమే అమలు చేయాలని ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయల ముందు ధర్నాలు నిర్వహిస్తున్నామని, శుక్రవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 34 ద్వారా మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు వికలాంగుల సంక్షేమ శాఖ మధ్య జిల్లాలో అందుబాటులో ఉన్న ఉద్యోగులను సర్దుబాటు చేసి వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని 2022 డిసెంబర్ 2వ తేదీన ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం జీవో ఇచ్చి 3 సంవత్సరాలు గడుస్తున్నా అమలు కావడం లేదు.వికలాంగుల సంక్షేమం కోసం నిర్వహణ కోసం అసిస్టెంట్ డైరెక్టర్ ను జిల్లా స్థాయిలో తిరిగి నియమించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసింది. గతంలో వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా,శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసిన వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని గతంలో విడుదల చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసింది.జిల్లా స్థాయిలో వికలాంగులకు సమర్థవంతమైన సేవలు అందించడానికి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ నుండి వికలాంగుల సంక్షేమ శాఖను విభజించాలని గత ప్రభుత్వం నిర్ణయం చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 23 నెలలు అవుతున్న జీవో నెం 34 అమలు కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వేలాది ఉద్యోగాలను కొత్తగా నియమించడం జరిగింది. వారిలో నుండి వికలాంగుల సంక్షేమ శాఖను అవసరమైన ఉద్యోగులను నియమించడానికి అవకాశం ఉన్న ప్రభుత్వం ప్రయత్నం చేయటంలేదని అన్నారు..

# వందేమాతరం గీతం 150 ఏళ్ళ సందర్భంగా గీతాలాపన



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వందేమాతరం గీతం రచించబడి 150 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్లో విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశ భక్తి గీతాన్ని ఆలపించారు. అనంతరం విద్యార్థులకు పళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉత్సాహభరితంగా ఈ వేడుకలు జరుగుతున్నాయని తెలిపారు. బంకిమ్‌చంద్ర చటర్జీ 1875లో రచించిన వందేమాతరం గీతం స్వాతంత్ర్య సమరయోధులకు అపారమైన ప్రేరణగా నిలిచిందని చెప్పారు. "వందే మాతరం" అనే మంత్రం ఆ కాలంలోని యువతలో దేశభక్తిని రగిలించిందని, ఈ గీతం భారత జాతీయోద్యమానికి ఆత్మగా నిలిచిందని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక గీతం మాత్రమే కాకుండా దేశప్రేమ, త్యాగం, ఐక్యతకు ప్రతీక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం, ఏఎస్ఐ రవీందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాజం, కానిస్టేబుల్‌లు వెంకటేష్, శ్రీనివాస్, సతీష్, ఆరిఫ్, రమేష్, లహరి ప్రియ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సేవకులకు భీమా రక్షణ

- ఎంపీడీవో తహేరా బేగం ముందడుగు



**చట్టం/ ఎల్లారెడ్డి :** మండల పరిషత్ అభివృద్ధి అధికారి తహేరా బేగం, మండల విద్యా అధికారి ప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గ్రామపంచాయతీ అడవి లింగాల పరిధిలోని ఎంపీడబ్ల్యు (మల్టీ పర్పస్ వర్కర్స్) కు ఇన్స్యూరెన్స్ భీమా చేయించనైనదనీ, ప్రజా సేవలో నిత్యం కృషి చేసే గ్రామస్థాయి సిబ్బందికి భీమా రక్షణ కల్పించడం ప్రశంసనీయమని అధికారులు తెలిపారు. అనుకోని ప్రమాదాలు, ఆరోగ్య సమస్యల సమయంలో ఈ భీమా రక్షణగా నిలుస్తుందని ఎంపీడీవో తహేరా బేగం పేర్కొన్నారు. సిబ్బంది భద్రతే మన ప్రాధాన్యత అని ఎంపీఓ ప్రకాష్ స్పష్టం చేశారు. భీమా సదుపాయం కల్పించినందుకు (ఎంపీడబ్ల్యూ) వర్కర్లు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి దిశగా ఇలాంటి సంక్షేమ చర్యలు కొనసాగిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# టీపీసీసీ అధ్యక్షుడి కుటుంబ వివాహానికి హాజరైన ఎమ్మెల్యే మదన్మోహన్



**చట్టం/ ఎల్లారెడ్డి:** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మేనకోడలు వివాహ శుభకార్యానికి శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ హాజరయ్యారు. హైదరాబాద్ లోని అడ్రెస్స్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ, వారి దాంపత్య జీవితం సుఖశాంతులతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో స్నేహపూర్వకంగా ముచ్చటించిన ఎమ్మెల్యే, మహేష్‌గౌడ్ కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్వాతంత్ర్య పోరాటంలో ఉత్సాహం నింపిన గేయం వందేమాతరం

- వందేమాతర గేయం రచించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భముగా అర్వింద్



**(చట్టంనిజామాబాద్)** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో ఉత్సాహం నింపిన గేయంగా వందేమాతరం చరిత్రలో నిలిచిపోయిందని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి అన్నారు. వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిజామాబాద్ నగరంలోని RBVRR పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత ప్రభుత్వం 150 చోట్ల ఈ కార్యక్రమాన్ని పండగ లా చేయాలని నిర్ణయించిందని అన్నారు. 150 వ సంవత్సరాన్ని ఇలా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు .ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సామూహికంగా వందేమాతర గీతాలాపన చేశారు. ఈనెల 26 వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. అనంతరం నాయకులు, విద్యార్థులతో కలిసి స్వదేశీ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, RBVRR సొసైటీ చైర్మన్, అధ్యక్ష కార్యదర్శులు అధ్యక్ష కార్యదర్శులు అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామూహిక వందేమాతరం ఆలాపన



**చట్టం బిచ్కుంద:** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) బిచ్కుందలో నేడు, బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం జాతీయ గీతానికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు కళాశాల విద్యార్థులు సామూహికంగా వందేమాతరాన్ని ఆలపించారు . ప్రిన్సిపాల్ శ్రీ . కె. అశోక్ గారు జాతీయ గీతం గొప్పతనాని నాటి కాలం లో ఏ రకంగా చైతన్య పర్చిందో విద్యార్థులకు వివరించారు .ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్స్ వై .సంజీవరెడ్డి ఎ . రఘునాథ్ మరియు అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# సర్దార్ పటేల్ ఆశయాలను సాధించడం మన అందరి బాధ్యత

- సిద్దిపేటలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి వేడుకలు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** దేశ సమైక్యత కోసం పోరాడిన సర్దార్ పటేల్ ఆశయాలను సాధించడం మన అందరి బాధ్యత అని మేరా యువ భారత్ మై భారత్' ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకట నర్సయ్యలు పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ సమైక్యతా స్ఫూర్తికి ప్రతీక అయిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 'మేరా యువ భారత్ మై భారత్' ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి వెంకట నర్సయ్య, జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్లు డా. మహేష్ పర్శరాములు, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి 'సర్దార్ @150 యూనిటీ మార్చ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉక్కుమనిషి స్ఫూర్తిని చాటుతూ దేశ సమైక్యత కోసం పోరాడిన సర్దార్ పటేల్ ఆశయాలను సాధించడం మన అందరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయన 150వ జయంతిని అధికారికంగా నిర్వహించాలనే కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'ఏక్ భారత్ ఆత్మనిర్భర్ భారత్' పేరిట ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల భాగంగా అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 వరకు సిద్దిపేట జిల్లాలో పలు ఏక్తా యాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. అక్టోబర్ 31న సర్దార్ పటేల్ విగ్రహాలకు నివాళులు అర్పించి, ముస్తాబాద్ చౌరస్తా నుండి విక్టరీ చౌరస్తా దాకా, అక్కడి నుండి కోమటి చెరువు ఓపెన్ ఆడిటోరియం వరకు ఏక్తా మార్చ్ నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ ఏక్తా మార్చ్‌లు జరుగుతాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా స్కూళ్లు, కాలేజీలు, విద్యాసంస్థల్లో సర్దార్ పటేల్ జీవిత విశేషాలపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నారు. యువతలో డ్రగ్స్ రహిత భారత్, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలపై ప్రతిజ్ఞలు చేయించి చైతన్యాన్ని నింపనున్నారు. ప్రజల్లో దేశభక్తి, సమైక్యతా భావాలు పెంపొందించేలా నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కూడా చేపడతామని తెలిపారు. ప్రతిభావంతులకు సర్టిఫికేట్లు కూడా అందజేయనున్నారు. యువత పటేల్ స్ఫూర్తిని ఆచరిస్తూ, దేశ సమైక్యత కోసం తమ వంతు కృషి చేయాలని, సిద్దిపేటలో జరగబోయే 'మేరా యువ భారత్ ఏక్తా ర్యాలీ'లో ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వలుస సుభాష్, అధికం రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో వడ్డెర్లపై దూషణ ఫిర్యాదు దాఖలు, కఠిన చర్యలు తీసుకోవాలని వడ్డెర సంఘాల డిమాండ్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం ఆధ్వర్యంలో, సిద్ధిపేట జిల్లా వడ్డెర సంఘం సభ్యులు వడ్డెర కులాన్ని అవమానపరిచే రీతిలో వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన నవంబర్ 5, 2025న చోటుచేసుకుంది. మండపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల గాంధీ రెడ్డి, మేడిపల్లి గ్రామానికి చెందిన వడ్డెర యువకుడు కుంచం రవిని డి.ఎక్స్. ఎన్ కంపెనీ రోడ్డుసమీపంలో ట్రాక్టర్‌తో గ్రానైట్ తరలిస్తున్న సమయంలో ఆపి, తీవ్రంగా అవమానపరిచినట్టు వడ్డెర సంఘం తెలిపింది. సంఘం నాయకుల వివరాల ప్రకారం, ఆ వ్యక్తి రవిని బూతు మాటలు తిడుతూ, వడ్డెర జాతిపై అసభ్యకర పదాలు ఉపయోగించి, వ్యక్తిగతంగా దాడి చేసినట్టు తెలిపారు. ఈ చర్య వడ్డెర సమాజ ఆత్మగౌరవంపై దాడి చేసినట్టేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వడ్డెర సంఘం నేతలు సిద్ధిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరు మాట్లాడుతూ – "వడ్డెర కులానికి ఉన్న చారిత్రక నేపథ్యం, మట్టిపని, రాళ్లు కొట్టి జీవనం కొనసాగించే మా వృత్తి గురించి తెలియకుండా జాతిని దూషించడం అసహ్యకరం. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిచో మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తాము," అని హెచ్చరించారు. ఈ ఫిర్యాదులో సిద్దిపేట జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు కుంచం శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు, పట్టణ అధ్యక్షుడు ఇరుగడిండ్ల తిరుపతి, రేపాక స్వామి, కొమ్మ రాజుల నర్సింలు, శివరాత్రి బాలయ్య, బోదాసు మల్లేశం, వల్లపు శ్రీనివాస్, గొడ్డన్న యాదగిరి, వల్లెపు మల్లేశం, బోదాస్ నాగరాజు, వల్లెపు పవన్‌కుమార్, దున్నపోతుల శీను, సూర కిష్ట తదితరులు పాల్గొన్నారు. అలాగే సంఘటనపై విచారం వ్యక్తం చేస్తూ బి.సి సంక్షేమ సంఘం సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు కంకటి నవీన్ గౌడ్, దళిత సంఘాల రాష్ట్ర ఐకస అధ్యక్షుడు బత్తుల చంద్రం మరియు బి.సి సంక్షేమ సంఘం నాయకులు వడ్డెర సంఘానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. వీరు పేర్కొంటూ – "వడ్డెర సమాజం కష్టపడి బండలు, మట్టి పనులతో సమాజ నిర్మాణానికి తోడ్పడుతోంది. అలాంటి సమాజాన్ని అవమానించే ప్రయత్నం మేము భరించం. ఇలాంటి చర్యలు మళ్లీ జరగకుండా పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకోవాలి," అని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఈ ఘటన ఉద్రిక్తత సృష్టించగా, వడ్డెర సంఘం నాయకులు శాంతి భద్రతలను కాపాడేలా పోలీసులకు విజ్ఞప్తి చేశారు

# రాష్ట్రం ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజులను తక్షణమే విడుదల చేయాలి

- లేని యెడల జిల్లా మంత్రులను, స్థానిక ఎమ్మెల్యేలను అడ్డుకుంటాం
- ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి టీ. రాజేష్



**చట్టం న్యూస్ జహీరాబాద్:** పట్టణంలోని ఆచార్య డిగ్రీ కాలేజ్ నుండు ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్లడం జరుగుతుంది ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని శుక్రవారం నిరసన వ్యక్తం తెలియజేయడం జరిగింది.అనంతరం ఆర్డీఓ గారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ రాజేష్ మాట్లాడుతూ, తెలంగాణలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు దాదాపు 5 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం తన ఎన్నిక ప్రణాళికల్లో (మానిఫెస్టో) స్పష్టంగా హామీ ఇచ్చినప్పటికీ, ఈ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంలో పూర్తి అశ్రద్ధ చూపుతోంది. ఈ ఆలస్యం వల్ల విద్యార్థులు భారీ మొత్తాల్లో ఫీజు రుణాల్లో చిక్కుకుని, చదువు ఆపివేసే పరిస్థితికి దిగబడ్డారు. ఇది ప్రభుత్వం ఇచ్చిన హామీలను మోసం చేయడమే కాక, విద్యార్థుల భవిష్యత్తును బెదిరించే చర్య అని అన్నారు. పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ పై అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు విడుదల చేయడం లేదని అన్నారు. విద్యార్థుల పైన ఎందుకు ఇంత కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అంతేకాకుండా సర్టిఫికెట్లు అడిగితే ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యం డబ్బులు కడితేనే మేము సర్టిఫికెట్లు ఇస్తాం అని విద్యార్థులను చాలా ఇబ్బందులు పెడుతున్నటువంటి పరిస్థితి ఉంది కాబట్టి తక్షణమే విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేనియెడల స్థానిక మంత్రులను, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని అన్నారు భవిష్యత్తులో ఎస్ఎఫ్ఐ అద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఏరియా అధ్యక్షులు హరీష్, విద్యార్థి నాయకులు సాయి గౌడ్, కోటిరెడ్డి ,సందీప్, దుర్గాప్రసాద్ , చంద్ర వర్ధన్, భారత , మల్లేశ్వరి , నికిత,సంతోష్ ,ఆకాష్ ,వినయ్ విద్యార్థి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# సైబర్ క్రైమ్, సిడిఆర్ విశ్లేషణపై ఒకరోజు శిక్షణా శిబిరం



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (DTC)లో సైబర్ క్రైమ్ మరియు కాల్ డేటా రికార్డు (CDR) విశ్లేషణపై ఒకరోజు ప్రత్యేక వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని అరికట్టడానికి పోలీసు సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడం అత్యవసరమని అన్నారు. కాల్ డేటా రికార్డు విశ్లేషణ నేర విచారణలో కీలకమైన సాధనమని, దీని ద్వారా నేరస్థులను వేగంగా గుర్తించి చర్యలు తీసుకోవచ్చని వివరించారు. అలాగే, సైబర్ నేరాల నిరోధక చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ప్రజలు సైబర్ మోసాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, తమ వ్యక్తిగత సమాచారం రక్షణపై మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీరితో పాటు తొమ్మిది మంది ఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 19 మంది పోలీస్ కానిస్టేబుళ్లు సహా మొత్తం 34 మంది పోలీసు సిబ్బంది ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని నిపుణుల ద్వారా సైబర్ క్రైమ్ మరియు సిడిఆర్ విశ్లేషణ పద్ధతులపై సవివరంగా అవగాహన పొందారు. ఈ శిక్షణ ద్వారా జిల్లాలో సైబర్ నేరాల గుర్తింపు, విచారణలో నూతన సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించే దిశగా సిబ్బంది మరింత నైపుణ్యం పొందుతారని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, డిటిసి డీఎస్పీ ఎస్. శ్రీనివాసులు, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ జానయ్యతో పాటు సిఐలు ఎన్. శ్రీధర్ రెడ్డి (కోడంగల్), ఎస్. శ్రీనివాస్ రెడ్డి (పరిగి), జి. వెంకట్ (మొమింపేట్), వై. నాగేశ్ (కరణ్‌కోట) పాల్గొన్నారు.

# బిచ్కుంద కేంద్రంలో పలు హాస్టల్లో తనిఖీ చేసిన సివిల్ సప్లై ట్రాస్క్ ఫోర్స్ టీం



**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలో శుక్రవారం సివిల్ సప్లై ట్రాస్క్ పోర్ట్ టీం 3 హైదరాబాద్ వారు బిచ్కుంద కస్తూర్బా గాంధీ హాస్టల్లో మరియు ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్, బీసీ బాల బాలికల, మరియు ఎస్సీ బాల బాలికల హాస్టల్లో, అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు సరిగా అందించాలని పేర్కొన్నారు, ట్రాస్క్ ఫోర్స్ టీం వారు హాస్టల్లో వంటగది మరుగుదొడ్లు విద్యార్థులు పడుకునే గదులు శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు విద్యార్థులకు ఏ విధమైన సమస్యలు రాకుండా ప్రతి ఒక్కటి అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు ఇట్టి కార్యక్రమంలో ఓ ఎస్ డి శ్రీధర్ రెడ్డి, ఏ సి ఎస్ ఓ సుదర్శన్ రెడ్డి ,సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మహమ్మద్ ఖలీద్ డిప్యూటీ తాసిల్దార్ సివిల్ సప్లై బిచ్కుంద, సురేష్ డిప్యూటీ తాసిల్దార్ సివిల్ సప్లై ఎల్లారెడ్డి పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇల్లు త్వరగా నిర్మించుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ హయుం



**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండలం బిచ్కుంద మున్సిపాలిటీలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ హయుం గ్రామ ప్రజలతో మరియు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన అలబ్ధిదారులతో చర్చించి ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవాలని చెప్పారు . వారితో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకుడు నౌషా నాయక్, ఉత్తం నాయక్ ,ప్రజలు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పి పి సి బిచ్కుంద సెంటర్‌ను సందర్శించిన సీనియర్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ నారాయణ



**చట్టం బిచ్కుంద:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండలం లో పర్యవేక్షణ అధికారి సీనియర్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ నారాయణ మరియు జూనియర్ ఇనస్పెక్టర్ అబ్దుల్ అలీం పి పి సి బిచ్కుంద సెంటర్ ను సందర్శించడం జరిగింది. వారు మాట్లాడుతూ కేంద్రంలో గల వరి కుప్పలను తేమశాతం 17 లోపు వచ్చిన వెంటనే లోడ్ చేసి పంపాలి మరియు అన్లోడ్ అయిన లారీల ట్రక్ షీట్ వెనువెంటనే 100 శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని సెక్రటరీ మరియు సెంటర్ ఇంచార్జీ లను ఆదేశించడం జరిగింది.

# నీలా పిఎసిఎస్ ఆధ్వర్యంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు



**చట్టం రెంజల్ :** రెంజల్ మండలం నీలా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం శుక్రవారం ప్రత్యేక అధికారి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సోయాబీన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి అశోక్ కుమార్ మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం కొరకు అనేక కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో ఆరుంగాలం కష్టపడి పండించిన సోయాబీన్ పంటను ప్రైవేట్ దళాలకు విక్రయించి నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని దృఢ సంకల్పంతో ప్రభుత్వం నిర్ణయించే 5328/ ధర మేరకు సోయాబీన్ కొనుగోలు కేంద్రంలో విక్రయించి అధిక లాభాలను అర్జించి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోయాబీన్ కొనుగోలు కేంద్రంలో విక్రయించిన తదుపరి రైతుల ఖాతలలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు మీర్జా ఇమామ్ బేగ్, ఎంఎల్ రాజు, గోసుల గంగ కృష్ణ, పిఎసిఎస్ పాలకవర్గ సభ్యులు, సీఈవో రాందాస్, కార్యాలయ సిబ్బంది , రైతులు తదితరులు ఉన్నారు.

# మద్నూర్ తాసిల్దార్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన



**చట్టం మద్నూర్:** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని శుక్రవారం నాడు తాసిల్దార్ కార్యాల యంలో వందేమాతరం గీత లాపన నిర్వహించారు, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి నేటి విద్యార్థులకు, యువతకు, ప్రజలకు స్ఫూర్తినింపేది మన దేశ జాతీయ గేయమే అని తహసీల్దార్ ఎం డి ముజీబ్ అన్నారు. దేశ గౌరవం, ఐక్యతను పెంచుతున్న 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మద్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ముందు కార్యాలయ సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాలాపన చేశారు. బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ 7న దీనిని రచించారని అన్నారు. దేశ ప్రజల ఐక్యతకు, లౌకిక వ్యవస్థ కు చిహ్నం వందేమాతరం గేయం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బొమ్మల మైసయ్య



**చట్టం నార్సింగి :** తెలంగాణ ఉద్యమకారులు నీలం పద్మావతి శ్రీనివాస్ కూతురు జయశ్రీ, నవీన్ వివాహంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన మలల హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు దళిత రత్న అవార్డు గ్రహీత బొమ్మల మైసయ్య బిఆర్ఎస్ సీనియర్ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు గొల్లగూడ శ్రావణ్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారుడు సీనియర్ కళాకారుడు సాధినేని జంగ్ ప్రహ్లాద్ సతీమణి సాదినేని నవోమి మరియు తదితర ఉద్యమకారులు ఈ వివాహంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# మైసమ్మ తల్లి సాక్షిగా.. రణరంగంలా మారిన రామగుండం

- మున్సిపల్ సెక్రటరీ చర్యలు తీసుకుంటాడా
- మున్సిపల్ కమీషనర్ సస్పెండ్ అయ్యేనా
- రామగుండం శాసనసభ్యులు క్షమాపణ చెబుతారా
- ఇంత జరిగిన దీనిపై మీడియా పరంగా స్పందించని ఎమ్మెల్యే
- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకుంటాడా



**చట్టం రామగుండం :** రామగుండం కార్పొరేషన్ పరిధి లోని ఎన్టిపిసి గోదావరిఖని ప్రాంతాలలో రెండు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది సహకారంతో 46 దారి మైసమ్మ గుడులు కూల్చడం జరిగిన విషయం తెలిసినదే. దీనిపై ప్రజలు స్పందిస్తూ.. అందరం కలిసి తల కొంత డబ్బులు వేసుకొని గుడిని నిర్మిస్తే దొంగల్లాగ అర్ధ రాత్రి కూలుస్తారా అంటూ నానా రకాల దూర్భాషలు అన్నారు. ఈ అరాచకాన్ని నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు కలిసి గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని పోచమ్మ గుడిలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. విశ్వ హిందూ నాయకులు మాట్లాడుతూ... రామగుండం కార్పొరేషన్ లో నగరాన్ని అభివృద్ధి చేస్తామంటూ మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రాత్రి మూడున్నర గంటలకు 46 మైసమ్మ గుళ్లను కూలగొట్టారు. అభివృద్ధిలో భాగంగా కూలగొట్టాలంటే అంటే అన్ని మతాల గుళ్లను కూడా కూలకొట్టాలి. కేవలం మైసమ్మ గుళ్లను కూలగొట్టడం హిందువుల మనోభావాన్ని దెబ్బతీయడమే. ప్రతి ఒక్కరూ రోడ్డుమీద ప్రమాదం జరగకుండా రోడ్డు పక్కన దారి మైసమ్మ గుడిని కట్టారు. దీనివలన ప్రమాదాలు తగ్గుతాయని ప్రజల విశ్వాసం ఆ విశ్వాసాన్ని ఈరోజు మున్సిపల్ కమిషనర్ దెబ్బతీశారు. ఆ మున్సిపల్ కమిషనర్ ని సస్పెండ్ చేయాలి. సుప్రీంకోర్టు అన్ని మతాల గుళ్లను కూలగొట్టమని చెప్పింది. సుప్రీంకోర్టుకు మతాలు అనేవి ఉండవు. కానీ ఈరోజు హిందువుల గుళ్ళను మాత్రమే కూలగొట్టారు. అందుకే ఈరోజు అన్ని పార్టీలతోటి కార్యాచరణ రూపొందించాం.

మా డిమాండ్లు మున్సిపల్ కమిషన్ సస్పెండ్ చేయాలి ఉన్న చోటనే గుళ్ళు మళ్ళీ తిరిగి కట్టాలి లేదంటే రాస్తారోకోలు తప్పవని హెచ్చరించారు.ఈ ఘటన పై కౌశిక్ హరి మాట్లాడుతూ... మొన్నటి వరకు ఇండ్లు, షాప్ లు కూలకొట్టిండు, ఇప్పుడు గుళ్ల మీద పడ్డాడు. దారి మైసమ్మ గుళ్ళు దారి పక్కన ఉంటాయి. రోడ్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రజలు భక్తితో వాటిని రోడ్డు పక్కన కట్టుకున్నారు. ఎందుకంటే ప్రమాదాలు జరుగకూడదని ప్రజల విశ్వాసం. ఈ గుడుల మీద మున్సిపాలిటీ నుంచి నోటీసు లేదు, ప్రెస్ మీట్ లేదు రాత్రికి రాత్రే కూలగొట్టి చెత్త ట్రాక్టర్ లో వేసుకొని వెళ్లారు. సుప్రీం కోర్టు రోడ్డు కు అడ్డంగా వున్నవి కూల్చమని చెప్పింది. రోడ్డుకు పక్కన ఉన్నవి కాదని అన్నారు.మీరు ఒక గవర్నమెంట్ చెప్పి చేయాలి, కబ్జా దారులు ఐతే రాత్రికి రాత్రే కూలగొడతారు ఇదొక దౌర్జన్యమైన చర్య అని విమర్శించారు. ఈ ఘటన పై వేముల అశోక్ మాట్లాడుతూ... ఈ ఏరియా లోని పలు శాఖలకు సంబందించిన అధికారులు, ఏ శాఖ అధికారులయినా సరే మీ విధులను మీరు నిర్వహించండి. ఎవరో చెప్పారని, ఎవరో అండగా వున్నారని ప్రజా వ్యతిరేక పనులు చేస్తే ఏమి కాదులే అనుకుంటే పొరపాటు. ప్రజలు వీధుల్లో అరవడానికి, రాస్తారోకోలు చేయడానికి పనికి వస్తారు అనుకుంటే పొరపాటె,ఇది చైతన్యానికి అడ్డ గోదావరిఖని గడ్డ ఎవరు తప్పు చేసిన ఊరుకొనేది లేదు వారి పైన చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటాము. మీరు చరిత్ర లో చూస్తే కొందరు ఐపిఎస్, ఐఏఎస్ అధికారులు తప్పులు చేస్తే ఈ రోజు వాళ్ళు జైల్లో వున్నారని, రేపు అలాంటి పరిస్థితి రావచ్చని అన్నారు. పోచమ్మ గుడి నుండి హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులు పోచమ్మ గుడి నుండి మున్సిపాలిటీ ఆఫీస్ కు ర్యాలీ నిర్వహించారు. వద్దురా నాయన కాంగ్రెస్ పాలన, మున్సిపాలిటీ కమీషనర్ ను సస్పెండ్ చేయాలి అంటూ మున్సిపాలిటీ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ఆఫీస్ ముందు కూర్చొని మున్సిపల్ కమీషనర్ క్షమాపణ చెప్పాలి, మున్సిపల్ కమీషనర్ ను సస్పెండ్ చేయాలి, జై శ్రీరామ్ అంటూ ఈ నినాదాలతో హోరెత్తించారు. మున్సిపాలిటీ ఆఫీస్ కు జిల్లా కలెక్టర్ రావాలని లేదంటే హైవే పై రాస్తా రోకో చేస్తామని అన్ని పార్టీల నాయకులు తెలిపారు. మున్సిపాలిటీ ఆఫీస్ లో గంట సేపు కూర్చొని నినాదాలు చేసిన ఎటువంటి సమాధానం రాకపోయేసరికి అక్కడినుండి బయలు దేరి మున్సిపాలిటీ పెట్రోల్ బంక్ చౌరస్తా ముందు హైవే పై కూర్చొని నినాదాలు చేశారు. ఈ రాస్తా రోకో తో హైవే పై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వెంటనే గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనరెడ్డి అక్కడ జరుగుతున్న విషయాన్ని ఏసీపీ మడత రమేష్ కు తెలుపడం తో అయన హుటాహుటిన వచ్చారు. ఏసీపీ అన్ని పార్టీల నాయకులకు సర్ది చెప్పిన వినకపోవటం తో కలెక్టర్ కు ఫోన్ చేసి తెలుపగా కలెక్టర్ వారిని సముదాయించి తగిన చర్యలు తీసుకుంటానని తెలుపడం తో శాంతించిన నాయకులు ఈ రాస్తా రోకోను విరమించుతూ, సరైన చర్యలు తీసుకోకపోతె రేపటి కార్యక్రమం లో పాల్గొనాలని తెలిపారు. చూద్దాం రేపటి కార్యక్రమంలో ఏం జరుగుతుందో మరి.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

- భద్రతా ఏర్పాట్లు, సీలింగ్ విధానాన్ని సమీక్ష



**చట్టం, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** – రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను సందర్శించారు. సాధారణ పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఆయన క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్‌లో వేసిన సీల్‌స్‌ను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్లు మరియు ఇతర ఎన్నికల సామాగ్రి భద్రపరిచిన విధానాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల సామాగ్రి భద్రతపై కలెక్టర్ అధికారులు సూచనలు జారీ చేశారు.అదేవిధంగా ఈవీఎం గోడౌన్ వద్ద ఉన్న పోలీసు బందోబస్తు ఏర్పాట్లను కూడా పరిశీలించారు. భద్రతా చర్యల్లో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జ్ రాములు, ఎన్నికల విభాగం అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వందేమాతరం జాతీయ గేయం 150వ వార్షికోత్సవ వేడుకలు



**చట్టం / పరకాల :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వందేమాతరం జాతీయగీతం రచించి నేటికి 150సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పరకాల మున్సిపల్ కార్యాలయములో వేడుకలు కమిషనర్ కె. సుస్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో కమిషనర్ జాతీయ పతాకం ఆవిష్కరించి వందేమాతర గీతం ఆలపించి, స్వాతంత్ర ఉద్యమకారులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇట్టి ఉత్సవాల్లో మనమంతా పాలు పంచుకోవడం సంతోషకరమని ఐక్యత, దేశభక్తితో ప్రతిపౌరుడు వారిని స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా మహాసభల సందర్భంగా కరపత్రాలు విడుదల



**చట్టం /నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆల్ ఇండియా మహాసభల సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశల అత్త ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న హత్యలు,హత్యాచారాలు పెరిగిన నిత్యవస ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు ప్రేమున్మాద దాడులు విద్య వైద్యం ఉద్యోగం ఇలా అనేక సమస్యల పైన నిరంతరం పోరాటం చేస్తూ దేశంలో రాష్ట్రంలో ఐద్వా గుర్తింపు పొంది దేశంలో ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచింది. కావున అందరూ ఆలిండియా మహాసభలను జయప్రదం అలానే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి సుజాత జిల్లా అధ్యక్షురాలు అనిత, జిల్లా కమిటీ సభ్యురాలు కవిత,జిల్లా కమిటీ సభ్యులు హసీనా బేగం, నగర నాయకులు, శ్రీదేవి,రేఖా, యశోద, రజియా తదితరులు పాల్గొన్నారు.

## కళ ఉత్సవంలో రాష్ట్రంలో మొదటి బహుమతి

- జాతీయ స్థాయి పోటీలకు ఎన్నిక



**చట్టం నవీపేట్ :** విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవం 2025 లో ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ విభాగంలో నవీపేట్ మండల కేంద్రంలో గల లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కు చెందిన 9వ తరగతి విద్యార్థి వజ్రాంశ్ రాష్ట్రంలో మొదటి బహుమతి గెలుచుకున్నాడు. హైదరాబాదులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో వీణ వాయిద్యంలో మొదటి బహుమతి గెలిచి జాతీయ స్థాయి పోటీకి ఎన్నికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు తెలిపారు. సెప్టెంబర్ నెలలో జరిగిన జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలిచి రాష్ట్ర స్థాయికి ఎన్నికై హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకోవడం అభినందనీయమని, జాతీయ స్థాయిలో ప్రథమంగా నిలవాలని విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థి లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వీణా వాయిద్యంలో శిక్షణను ఇప్పించిన తల్లిదండ్రులను అభినందించారు.

## వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు



**చట్టం న్యూస్ బీర్కూర్ :** జాతీయ గేయం 'వందేమాతరం' రచన పూర్తై 150 సంవత్సరాలు నెరవేరిన సందర్భంగా, ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు బీర్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారము "వందేమాతరం సామూహిక గీతాలపన" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని ప్రతిబింబించే గీతాలను సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూవందేమాతరం జాతీయోద్యమానికి ప్రేరణగా నిలిచిందని, దేశ స్వాతంత్ర్యంలో ఈ గేయానికి ఉన్న విశిష్ట స్థానాన్ని విద్యార్థులు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, విద్యార్థులు దేశభక్తి, రాజ్యాంగ విలువలు, సేవా భావంతో ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులు ఈ సందర్భంగా వందేమాతరం గేయ చరిత్ర, రచయిత బంకిమ్‌చంద్ర చట్టర్జీ జీవితం గురించి విద్యార్థులకు వివరించారు. సామూహిక గానం సందర్భంగా పాఠశాల ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మారుమ్రోగింది.ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్యా సంఘం ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటూ వినతి



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** బీసీలకు విద్య, ఉద్యోగాలు మరియు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, నారాయణ రావుపేట మండలంలో బి.సి ఎస్.సి ఎస్.టి జె.ఎ.సి ఆధ్వర్యంలో మండల ఎమ్మార్వో, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో జరిగింది. మండల కో కన్వీనర్ శ్యాగ బాబు మహారాజ్, బంజేరుపల్లి యువ నాయకుడు ఆకుల నవీన్ పటేల్ నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2025 మార్చ్ నెలలో బిల్ నంబర్లు 3, 4 ద్వారా విద్య, ఉద్యోగాలు మరియు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతూ ఆమోదించినట్లు తెలిపారు. ఈ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత కేంద్రానికి పంపబడ్డప్పటికీ, గత ఏడునెలలుగా 9వ షెడ్యూల్‌లో చేర్చడం పెండింగ్‌లో ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, తొమ్మిదవ షెడ్యూల్ అమలు సాధించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లులను తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను ఉపవర్గాల వారీగా విభజించి, అత్యంత వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.20,000 కోట్లు బీసీ సబ్ ప్లాన్ కింద ఖర్చు చేస్తామని ప్రకటించినా, మొదటి సంవత్సరంలో కేటాయించిన రూ.9,200 కోట్లలో కేవలం రూ.2,068 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. కాబట్టి బీసీల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కోసం రూ.40,000 కోట్లు తక్షణమే ఖర్చు చేయాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన అన్ని హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని నామినేటెడ్ పోస్టులు, కమిషన్లు, బోర్డులు, సలహా మండళ్లలో కనీసం 90 శాతం ప్రాతినిధ్యం బీసీ, ఎస్, ఎస్టీలకు ఇవ్వాలని కోరారు. ఇది సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమని వారు పేర్కొన్నారు. మా విజ్ఞప్తిని ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబు మహారాజ్, నవీన్ పటేల్‌తో పాటు బీసీ నాయకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కందకుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేపట్టిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



**చట్టం రెంజల్ :** రెంజల్ మండలంలో కందకుర్తి గ్రామంలో శుక్రవారం మాజీ మంత్రి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎంపీపీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోబిన్ ఖాన్ మాట్లాడుతు ప్రకృతి వైపరీత్యముతో రైతులు పంట నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో నిరుపేద కుటుంబాలను నిర్మూలించి అర్హులైన ప్రతి లబ్దిదారునికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ ప్రోత్సహిస్తుందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం నాణ్యత కూడిన పనులతో చేపట్టాలని మురికి నీరు ఇతరులకు ఇబ్బంది కలగకుండా గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇల్లు నిరంతర ప్రక్రియ అరులైన నిరుపేద కుటుంబాల లబ్ధిదారులు నిరుత్సవం పడకుండా అధికారులు సర్వే చేపట్టి అర్హులైన నిరుపేద కుటుంబాలకు విడతలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేపడుతున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఖలీల్ బేగ్, సాటాపూర్ మాజీ సర్పంచ్ జావిద్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీఓ రఫిక్ అహ్మద్, గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



**చట్టం భూపాల్ పల్లి ప్రతినిధి :** విద్యార్థులు భావి శాస్త్రవేత్తలు గా ఎదగాలని ములుగు పల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సక్కర ము నాయక్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యం లో పాఠశాల లోసైన్స్ టాలెంట్ టెస్ట్ పేపర్స్ ను ఆవిష్కరించారు. సి వి రామన్ జయంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు భావి శాస్త్రవేత్తలు గా ఎదగాలని అన్నారు. బయోలజీ టీచర్ కామిడి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ నా మతం సైన్స్ నేను సైన్స్ ను ప్రేమిస్తున్నాను. ఈ సృష్టి సైన్స్ తోనే ముడిపడింది అన్న రామన్ జీవిత చరిత్ర ను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని అన్నారు. నూతన విషయాల మీద ఆలోచన చేసి కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రజలలో సైన్స్ పట్ల మూఢ నమ్మకాల నిర్మూలన పట్ల చేస్తున్న వివిధ కార్యక్రమాలు ప్రశంస నీయము అన్నారు. పాఠశాల స్థాయిలో ప్రథమ బహుమతి పదవ తరగతిలో బి కీర్తన్ తొమ్మిదవ తరగతిలో ప్రణదీప్ ఎనిమిదవ తరగతిలో ముత్యాల అభిరామ్ విజేతలుగా నిలిచి మండల స్థాయి కి ఎంపిక అయ్యారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుంకు చంద్ర కళ జి సుధాకర్ రెడ్డి పి వెంకటేష్ పాల్గొన్నారు.

## మద్రి గ్రామానికి వేళ్ళే జాతీయ రహదారి చౌరస్తాలో ఐమాక్స్ లైట్ ఏర్పాటు తక్షణమే కల్పించాలి

- ప్రమాదాలకు నిలయంగా మాద్రి క్రాస్ రోడ్డు
- గ్రామ యువ నాయకుడు రాజశేఖర్ డిమాండ్



**చట్టం న్యూస్ కోహీర్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండల పరిధిలోని మద్రి గ్రామం జాతీయ రహదారి 65 కు సమీపంలో ఉన్నప్పటికీ, మద్రి చౌరస్తాలో కనీసం వెలుగు లెలగని దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఎద్దేవా వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల లేమితో తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్న గ్రామ వాసులు. ముఖ్యంగా యన్ హెచ్ 65 జాతీయ రహదారి మద్రి వెళ్ళే చౌరస్తాలో చిన్న చిక్కటి నెలకొన్న కూడా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా అనిపించకపోవడం విదురంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. కావున వెంటనే ప్రభుత్వం, అధికారులు చొరువ తీసుకొని చౌరస్తా వద్ద లైటింగ్ ఏర్పాటు చేయలని రాజశేఖర్ కోరారు. అంతేకాకుండా గ్రామం యొక్క ప్రధాన సమస్యలు అధికారుల దృష్టికి రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్ళే రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారు అవ్వడం జరిగింది. గూడును పట్టించుకోని నాథుడే కరువయ్యారని గ్రామస్తులు, యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .తగు సౌకర్యాలు లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరయు ప్రమాదాలకు దారి తీస్తోంది, చౌరస్తా వద్ద ప్రయాణికుల కోసం కనీసం బస్టాండ్ కూడా అందుబాటులో లేదు. దీంతో ప్రయాణికులు చల్లి ఎండ, వాన అనక రోడ్డు పైనే వీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామానికి చెందిన యువకుడు రాజశేఖర్ అవేదన వ్యకం చేస్తూ డిమాండ్ చేయడం జరిగింది..

## సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం :** గీసుగోండ మండలంలోని బొడ్డు చింతలపల్లి, చంద్రయ్య పల్లి, అనంతరం, కొమ్మల, విశ్వనాధపురం గ్రామాలలో సి ఆర్ ఆర్,ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో ఎస్సీ కాలనీలలో చేపట్టనున్న 33 లక్షల 59వేల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శుక్రవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే గ్రామాల నిజమైన అభివృద్ధి మహర్దశను చేరుకుంటుందని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని,ముఖ్యంగా ఎస్సీ కాలనీలలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు.పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పరకాల డైరీ ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు, సీఎంఆర్ఎఫ్ ,కళ్యాణ లక్ష్మి, తదితర సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందజేస్తున్నామనితెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ప్రేమ్ చంద్ హాకీ క్లబ్ విజయం పట్ల హర్ష వ్యక్తం చేసిన హనుమకొండ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు సోదా రామకృష్ణ



**చట్టం / పరకాల :** జాతీయ క్రీడా హాకీ ఇండియా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు సోదా రామకృష్ణ నేతృత్వంలో హాకీ క్రీడా పోటీలు నయీంనగర్ హాకీ క్లబ్ క్రీడ మైదానంలో నిర్వహించడం జరిగింది. జిల్లాలోని అన్ని హాకీ క్లబ్ క్రీడాకారులు పాల్గొనగా ఈ పోటీలో ప్రేమ్ చంద్ హాకీ క్లబ్ పరకాల మొదటి బహుమతి గెలుపొందగా. నయీంనగర్ హాకీ క్లబ్ రెండవ బహుమతి గెలుపొందడం జరిగింది. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తూ ప్రేమ్ చంద్ హాకీ క్లబ్ పరకాల విజయం పట్ల హనుమకొండ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ సోదా రామకృష్ణ తన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా హాకీ క్లబ్ అసోసియేషన్ సెక్రటరీ సయ్యద్ దుష్మన్ అలీ, సీనియర్ హాకీ క్రీడాకారులు నయీంనగర్ హాకీ క్లబ్ గౌరవ అధ్యక్షులు KR కృష్ణమూర్తి, మరియు జిల్లాలోని క్రీడాకారులందరూ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



**చట్టం/ పరకాల :** వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాల గ్రామంలో ఇటీవలే వివిధ కారణాలతో మృతిచెందిన ఏపూరి సుశీల,వీరాటి మోహన్ రెడ్డి,జక్కుల అయిలయ్య కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

## మహిళల సంక్షేమమే మా లక్ష్యం

- ఏపిఎం జయమాలిని ఆధ్వర్యంలో క్లస్టర్ల వారీగా గొర్రె పొట్టేళ్లపై శిక్షణ
- హాజరైన ఎపిడీ జోసెఫ్, ఎడి విజయ్, డిపిఎం నర్సింహా



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:** – మహిళల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యమని జిల్లా మహిళాభివృద్ధి శాఖ ఎపిడీ జోసెఫ్ అన్నారు. శుక్రవారం ఫరూక్ నగర్ మండలం మహిళా సమాఖ్య భవనంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి అధ్యక్షతన, ఏపిఎం జయమాలిని ఆధ్వర్యంలో క్లస్టర్ల వారీగా గొర్రె పొట్టేళ్ల పంపిణీ, శిక్షణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా మహిళాభివృద్ధి శాఖ ఎపిడీ జోసెఫ్, వెటర్నరీ వైద్యుడు విజయ్, డిపిఎం నర్సింహా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి క్లస్టర్‌కు ఇద్దరికి చొప్పున గొర్రె పొట్టేళ్లు పంపిణీ చేస్తున్నట్లు ఎపిడీ జోసెఫ్ తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు.అలాగే మహిళల అభివృద్ధికి బ్యాంకులు కూడా తగిన రుణాలు మంజూరు చేస్తున్నాయనీ, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా సామూహిక అభివృద్ధి సాధ్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ గొర్రెలను అందజేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఏపిఎం జయమాలిని మాట్లాడుతూ...మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగితే కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు మహిళలకు బలమైన వేదికగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి క్లస్టర్ లీడర్లు, మహిళా సంఘ సభ్యులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెన్నునొప్పితో ఇబ్బంది పడుతున్న రోగికి కొత్త జీవం మెడికవర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయం



**(చట్టంనిజామాబాద్)** నిజామాబాద్‌లో వైద్య రంగంలో మరో విశేషం చోటు చేసుకుంది. 47 ఏళ్ల వయసుగల చిన్నులు అనే రోగిపై అరుదైన వెన్నెముక శస్త్రచికిత్సను న్యూరో సర్జన్ డాక్టర్ కృష్ణ ఆదిత్య తన నిపుణుల బృందంతో కలిసి విజయవంతంగా పూర్తి చేశారు. గత కొన్ని నెలలుగా రోగికి తీవ్రమైన వెన్నునొప్పి, కాళ్లలో నిస్సృహ, నడవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించాయి. పలుచోట్ల చికిత్సలు చేయించుకున్నా ఉపశమనం లేకపోవడంతో, చిన్నులు మెడికవర్ హాస్పిటల్ న్యూరో విభాగాన్ని ఆశ్రయించారు.పరిశీలనలో అంటే వెన్నెముక నరాలపై ఒత్తిడి ఉన్నట్లు గుర్తించి, అత్యవసర శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తేల్చారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు, న్యూరో మానిటరింగ్ సదుపాయాలతో డాక్టర్ శ్రీకృష్ణ ఆదిత్య జాగ్రత్తగా ఆపరేషన్ పూర్తి చేశారు. ఆపరేషన్ జరిగిన మరుసటి రోజే రోగి నడవగలిగినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం పూర్తిగా సక్రమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.డాక్టర్ కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ ..“వెన్నెముక సంబంధిత సమస్యలు వయస్సుతో పెరుగుతుంటాయి. కానీ సమయానికి గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే రోగులు పూర్తిగా కోలుకోవచ్చు. ఆధునిక టెక్నాలజీ సహాయంతో ఇప్పుడు క్లిష్టమైన న్యూరో సర్జరీలు కూడా సురక్షితంగా, త్వరగా చేయగలుగుతున్నాం,” అని అన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో డాక్టర్ యజ్ఞ, సెంటర్ హెడ్ స్వామి, మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

CHATTAM NEWS

# ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాలలో దేశభక్తి జ్వాలలు



**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. కళాశాలన్ ఎన్ఎస్ఎస్ యూనిట్-I & II ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. ఇ. లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వందేమాతరం గీతం కేవలం పాట కాదు, అది భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణనిచ్చిన దేశభక్తి ప్రతీక అని పేర్కొన్నారు. గీతంలోని ప్రతి పదం మనలో దేశభక్తి భావాలను రగిలించేదని విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగగా, విద్యార్థులు ఏకస్వరంతో వందేమాతరం ఆలపించడం విశేషం. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమాధికారులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీర్కూర్‌లో ఉచిత డయాబెటిక్ క్యాంప్

**42 మందికి పరీక్షలు ఐదు మంది కి షుగర్ నిర్ధారణ**



**చట్టం న్యూస్ బీర్కూర్ :** బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రకాష్‌రావు క్యాంప్‌లో శుక్రవారం ఉచిత డయాబెటిక్ పరీక్షలను నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఉచితంగా రక్తంలో చక్కెర స్థాయిని పరీక్షించగా, 42 మంది పరీక్ష చేయించుకున్నారు. ఇందులో 5 మందికి షుగర్ స్థాయిలు అధికంగా గుర్తించడంతో, వెంటనే బీర్కూర్ ప్రభుత్వ దవాఖానను (PHC) సంప్రదించాలని లయన్స్ సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సితలే రమేష్, సీనియర్ లయన్స్ కిషోర్ దాస్, M.A. రషిద్, లయన్ సభ్యులు మేథ్రి కిరణ్, ల్యాబ్ టెక్నీషియన్ నారమ్ ప్రవీణ్, గ్రామ యువకులు పెంకి ప్రసాద్, సత్యనారాయణ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచడం, గ్రామాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని లయన్స్ సభ్యులు తెలిపారు.

# వీరాపూర్ తిమ్మాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లపై ఎం.పీడీవో సమీక్ష



చట్టం న్యూస్ బీర్కుర్ : ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఎం.పీడీవో శ్రీనిధి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. మంజూరు అయిన ఇళ్లకు సంబంధించి పనులు వేగవంతం చేసి, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో కొనసాగుతున్న నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ భానుప్రకాష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు దివ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం దేశభక్తి చైతన్యానికి చిహ్నం: ఆర్డీవో పార్థసింహా రెడ్డి



**చట్టం / ఎల్లారెడ్డి :** దేశభక్తి స్ఫూర్తి గీతం వందేమాతరం రచనకు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఆర్డీవో పార్థసింహారెడ్డి ఆధ్వర్యంలో గీతాలాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం దేశభక్తి చైతన్యానికి చిహ్నం, వందేమాతర గీతం స్వాతంత్ర్య సమరయోధుల రక్తంలో ఉత్సాహాన్ని నింపిన గీతం. బంకిం చంద్ర ఛటర్జీ రాసిన ఈ గీతం ఈనాటి యువతలో దేశభక్తి చైతన్యాన్ని మేల్కొలిపే శక్తి కలిగినది. దేశం పట్ల ప్రతి పౌరుడిలో త్యాగం, సేవా భావం పెంపొందించేదీ గీతమే అని పేర్కొన్నారు. ఇలాంటి గీతం 150 ఏళ్ల తర్వాత కూడా మన హృదయాల్లో గౌరవం, గర్వం నింపుతుంది. మనం అందరం వందేమాతర గీత స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కృషి చేయాలి అని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్యాలయ సిబ్బంది దేశభక్తి ఉత్సాహంతో పాల్గొన్నారు. గీతాలాపన అనంతరం జాతీయ జెండాకు వందనం చేసి, వందేమాతరం – జైహింద్ నినాదాలతో ప్రాంగణం మార్మోగింది.

# పెండింగ్ బకాయిలు చెల్లించాలి



**చట్టం :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యా సంస్థల బంద్ కొనసాగుతోంది. ఇప్పటికే నాలుగు రోజులు పూర్తవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి అన్ని ప్రొఫెషనల్ కళాశాలలు మూతపడ్డాయి. ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలన్న డిమాండ్‌తో "ఫతి" (ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ అండ్ ఇన్స్టిట్యూట్స్) పిలుపునిచ్చిన ఈ బంద్ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కొనసాగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అన్ని ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు ఏకమై బంద్‌ను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్ల ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలను క్లియర్ చేయకపోవడం వల్ల పరిస్థితి విషమంగా మారిందని తెలుస్తుంది ఇందులో కనీసం రూ.5వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని, మిగతా రూ.5వేల కోట్లను వచ్చే పది నెలల్లో, నెలకు రూ.500 కోట్ల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. రీయింబర్స్మెంట్ బకాయిలు వలన కళాశాలలు ఆర్థికంగా కుదేలైపోయాయని, విద్యార్థులకు సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి చాలా కాలేజీల్లో విద్యుత్, అద్దె, నిర్వహణ ఖర్చులు కూడా తీర్చలేని పరిస్థితి వుంది పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా

# వికారాబాద్‌లో ఆలస్యంగా తెలిసిన ఘటన... మైనర్ బాలికపై దారుణం



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా మోమిన్పేట్ మండల కేంద్రంలో జరిగిన ఒక సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మైనర్ బాలికను మాయమాటలు చెప్పి ఆటోలో తీసుకెళ్లి, చీమలదరి ప్రాంతంలోని ఓ వేన్చర్లో అత్యాచారం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సమాచారం ప్రకారం, వహీద్ (24) అనే వ్యక్తి 14 సంవత్సరాల బాలికను ఆశలు చూపించి తన వెంట తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలికపై దారుణం చేసి, వీడియో చిత్రీకరణ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిపై SC/ST అట్రాసిటీతో పాటు పొక్సో చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. నిందితుడిని రిమాండ్‌కు తరలించే ప్రక్రియ కొనసాగుతోంది.పోలీసులు స్థానిక సాక్ష్యం, డిజిటల్ ఆధారాలు, మెడికల్ రిపోర్టులు వంటి వివరాలను సేకరిస్తూ విచారణను ముందుకు తీసుకుపోతున్నారు.

# విద్యా చైతన్యానికి పిలుపునిచ్చిన ఎంపీడీవో తహేరా బేగం



**చట్టం /ఎల్లారెడ్డి :** ఎంపీడీవో తహేరా బేగం, ఎంపీఓ ప్రకాష్ శుక్రవారం లక్స్మాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హాజరు శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరు పెంపుతో పాటు విద్య నాణ్యతను మెరుగుపరచడంలో ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులలో విద్య ప్రాధాన్యం పట్ల అవగాహన కల్పించేందుకు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు నిరంతరం నిర్వహించాలన్నారు. విద్యతోనే పిల్లల భవిష్యత్తు మారుతుందని, ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లలు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలని ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్శనలో ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బీర్కూరు గ్రామంలో మానవతా సేవ



**చట్టం న్యూస్ బీర్కుర్ :** బీర్కూర్‌కు చెందిన లక్ష్మణ్ వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ యువ నాయకుడు చందు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ఒక నెలపాటు సరిపడ నిత్యావసర సరుకులు, అలాగే రూ.2,000 నగదు సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, సాయిలు, పీరయ్య, అప్సర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు చందు చేసిన సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు మరింత వేగవంతంగా సాగాలి

- **ఇండ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభించని చోట్ల ఎందుకు ప్రారంభం కాలేదో ఆ వివరాలను వారం రోజుల్లో అధికారులు అందజేయాలి**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
- **హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ, డిఆర్డిఏ, మెప్మా, ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్షఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్షా సమావేశం**



**చట్టం / హనుమకొండ:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి మరింత వేగవంతంగా సాగే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ, డిఆర్డిఏ, మెప్మా, ఎంపీడీవోలతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మండలాలు, మున్సిపల్ పరిధిలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, ఇంకా ఇండ్ల నిర్మాణం మొదలు పెట్టని లబ్ధిదారుల సంఖ్య, తదితర అంశాలను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వారం రోజుల్లోగా ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 295 స్లాబ్ లెవెల్ వచ్చిన ఇండ్లు పది రోజుల్లో లబ్ధిదారులు పూర్తి చేసుకునే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఎంజిఎన్ఆర్ఇజిఎస్, ఎస్ బి ఎం కింద ఇందిరమ్మ లబ్ధిదారులను ఆ పథకాలకు అనుసంధానం చేయాలన్నారు. ఇంకా లబ్ధిదారులు ఎవరైనా మిగిలి ఉన్నట్లయితే వారిని త్వరగా గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాలకు సంబంధించి తక్కువ ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో లబ్ధిదారులకు రూ.లక్ష లోపు రుణాలను అందించి త్వరగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా అధికారులు తోడ్పాటును అందించాలన్నారు. 2బీహెచ్ కె ఇండ్ల కు లబ్ధిదారుల ఎంపికను వారం రోజుల్లో గుర్తించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పైలట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసునేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మేన శ్రీను, గృహ నిర్మాణ శాఖ పీడీ హరికృష్ణ, మెప్మా పీడీ జోనా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డివిజన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ, హౌసింగ్ డిఈలు రవీందర్, సిద్ధార్థ నాయక్, ఎంపీడీవోలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేయడం నేరం: జెడ్పి సీఈవో ఎల్లయ్య



**చట్టం నార్సింగి :** మెదక్ జిల్లా నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం లైన్ డిపార్ట్మెంట్ 16 మంది కమిటీని ఏర్పాటు చేశారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేయడం నేరమని జిల్లా జడ్పీ సీఈవో ఎల్లయ్య, తెలిపారు మండల పరిషత్ కార్యాలయంలో బాల్యవివాహాల విరోధం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలపై నిరోధక చట్టం 2006 ప్రకారం బాలుడికి 21 బాలికకు 18 సంవత్సరాలు నిండకముందు పెళ్లి చేయడం నేరమని తెలిపారు. ఒకవేళ అలాంటి వివాహం జరిపించిన లేదా ప్రోత్సహించిన వారికి రెండేళ్లు జైలు శిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారని అలాగే బెల్ కూడా లభించదని తెలిపారు. ప్రభుత్వం ఈ చట్టం కింద బాల్య వివాహాల నిషేధ అధికారులను ప్రత్యేకంగా నియమించింది అని తెలిపారు. ఎంపీడీవో ప్రీతి రెడ్డి, మాట్లాడుతూ బాల్యవివాహాలు సామాజికంగా ఆర్థికంగా శారీరకంగా మానసికంగా తీవ్ర దుష్పరిణామాలకు దారి తీస్తాయని తెలిపారు. చిన్నవయసులో గర్భం దాల్చడం వల్ల తల్లి శిశువు మరణాలు పెరుగుతాయని తెలిపారు. పౌష్టికాహారం లోపం రక్తహీనత వంటి సమస్యలు కూడా ఎక్కువగా తలెత్తయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుజాత, ఎంపీడీవో ప్రీతి రెడ్డి, తాసిల్దార్ గ్రేసీ బాయ్, ఎంఈఓ సయ్యద్, ఎస్సై సృజన, వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, విజన్ సమస్త ప్రతినిధి కే యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# యావపూర్ గ్రామంలో ఆస్తి తగాదా

- **ఇంట్లోకి అక్రమంగా చొరబడి సామాన్లు తీసుకెళ్లిన ఆడపడుచుల వారి భర్తలు**



**చట్టం, తూప్రాన్:** యావపూర్ గ్రామంలో ఆస్తి తగాదాలపై ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక మహిళ శేరి కవిత మీడియాతో మాట్లాడుతూ, తన భర్త కీర్తిశేషులు మహిపాల్ రెడ్డి మరణానంతరం తన భర్త ఆడపడుచులు మరియు వారి భర్తలు తమ ఇంటిపై అక్రమ హక్కు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కవిత తెలిపిన వివరాల ప్రకారం దాదాపు 20 సంవత్సరాల క్రితం మహిపాల్ రెడ్డిని వివాహం చేసుకున్నానని, వైష్ణవి (19), వరుణ్ రెడ్డి (18) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. పెళ్లి సందర్భంగా కట్న కానుకలలో భాగంగా ఎకరా 20 గుంటల భూమి రాసి ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. తరువాత కాలంలో మహిపాల్ రెడ్డి చెడు వ్యసనాలకు బానిసై కుటుంబంలో విభేదాలు తలెత్తడంతో తాను తన తల్లి ఇంట్లో నివసిస్తున్నానని ఆమె వివరించారు. భర్త మరణం తరువాత ఆయన ఆడపడుచులు ఆస్తిని తమ పేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆ భూమిని మళ్లీ ఇతరులకు విక్రయించారని తెలిపారు. ఇటీవల గ్రామస్తులు మధ్యవర్తిత్వం చేయగా కూడా వారు వినిపించుకోలేదని, శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు తమ భర్తలతో కలిసి ఇంట్లోకి అక్రమంగా చొరబడి వస్తువులను తీసుకెళ్లారని కవిత తెలిపారు. దీనిపై తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువురి మధ్య తగాదాను సద్దుమణిగించారు. బాధితురాలు కవిత పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇక ఈ ఘటనపై అడ్వకేట్ జయం మాట్లాడుతూ —— "ఆస్తి వివాదం కోర్టులో ఉండగానే ఇంట్లోకి అక్రమంగా చొరబడడం చట్టవిరుద్ధం అని అన్నారు. తక్షణమే పోలీసులు కేసు నమోదు చేసి న్యాయం చేయాలి" అని మీడియాతో తెలిపారు.

# కలెక్టరేట్ లో ఘనంగా సామూహిక వందేమాతరం గేయాలాపన వేడుక

- **పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** శుక్రవారం ఉదయం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జాతీయ గేయం వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, సామూహిక వందేమాతరం ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. మొదటగా కలెక్టర్, అధికారులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర సంగ్రామంలో వందేమాతరం గేయం ఎంతోమంది సమరయోధుల్లో స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షను రగిలించడంలో కీలక భూమిక పోషించిందని అన్నారు. బంకించంద్ర చటర్జీ, 1875 నవంబర్ 07 న జాతీయ గేయం 'వందేమాతరం' రచించడం జరిగిందని వివరించారు. జాతీయ గేయం, జాతీయ గీతం భారతదేశ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడంలో నేటికీ కీలక భూమిక పోషిస్తున్నాయని వివరించారు. ఈరోజు వందేమాతరం ఆలాపన కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించడం ఎంతో గర్వించదగ్గ విషయమని చెప్పారు. ప్రజలంతా దేశభక్తి, దేశంపై గౌరవం కలిగి ఉండాలని అన్నారు. జాతీయ గేయం స్ఫూర్తితో అధికారులంతా ఉన్నత భావాలను కలిగియుండి, దేశాభివృద్ధిలో నిరంతరం తోడ్పాటును అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా వందేమాతరం చారిత్రాత్మక ప్రాముఖ్యతపై అందరికీ అవగాహన కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. వందేమాతరం గేయ ఆలాపన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బోధన్‌లో గంజాయి రవాణా: ముగ్గురు అరెస్ట్



**చట్టం, బోధన్ :** స్థానిక ACP శ్రీనివాస్ తెలుపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని బిలోలి నుంచి బోధన్‌కు వస్తున్న ఆటోను శుక్రవారం మద్రి మైసమ్మ దేవాలయం సమీపంలో తనిఖీ చేయగా అక్రమంగా రవాణా చేస్తున్న 1.270 కిలోల గంజాయి స్వాధీనం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి రవాణాలో నిమగ్నమై ఉన్న గోనేకర్ గణేష్ కాశీనాథ్ (బిలోలి), గాడే శేఖర్ (బోధన్), షేక్ అబ్దుల్ ఖైసర్ (నిజామాబాద్) లను పోలీసులు అరెస్ట్ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకున్న సిబ్బందిని అభినందించిన ACP శ్రీనివాస్, డ్రగ్స్ వాడకాన్ని నిర్మూలించేందుకు పోలీసుల చర్యలు మరింత పటిష్టం చేస్తామని అన్నారు.

# నవంబర్ 15 న స్పెషల్ లోక్ అదాలత్

- **నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల**



**చట్టం, నిర్మల ప్రతినిధి :** నవంబర్ 15న జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్ సందర్భంగా, కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకునే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, విజ్ఞప్తి చేశారు. స్పెషల్ లోక్ అదాలత్ లో మైనర్ కేసులు, అంతగా తీవ్రం కానీ లా అండ్ ఆర్డర్ కేసులు, క్రిమినల్ కేసులు పరిష్కరించబడతాయి. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమపై ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించిన ఎస్పీ ప్రజల చిన్నచిన్న కేసులు, పెండింగ్ వారెంట్లు, లీగల్ సర్వీసులతో సంబంధిత అంశాలు వేగంగా పరిష్కారమవ్వడం ద్వారా ప్రజలకు తక్షణ న్యాయం అందించడం లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశ్యం" అని తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో కేసుల పరిశీలన పూర్తి చేసి, లోక్ అదాలత్‌కు సంబంధించిన వివరాలను సంబంధిత కక్షిదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

# ఆడెల్లి శ్రీ మహా పోచమ్మని దర్శించుకున్న కలెక్టర్ అభిలాష అభినవ్



**చట్టం, సారంగాపూర్ :** ఆడెల్లి శ్రీ మహా పోచమ్మ అమ్మవారిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, శుక్రవారం దర్శించుకున్నారు. ఆడెల్లి నూతన దేవాలయ ప్రారంభోత్సవం, పోచమ్మ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్టాపన వేడుకల సందర్భంగా కలెక్టర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు ఆలయ పండితులు, అధికారులు స్వాగతం పలికారు. నూతన ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారి ఆశీర్వచనాలు, మంగళహారతులు, తీర్థప్రసాదాలు కలెక్టర్ కు అందజేశారు. శాలువాతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..., సర్వాంగ సుందరంగా నూతన ఆలయం ప్రారంభించుకొని, అమ్మవారి కొత్త విగ్రహాన్ని ప్రతిష్టించుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరారు. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించాలని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ భోజా గౌడ్, ఈవో భూమయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఘనంగా "వందే మాతరం" జాతీయ గీతం 150 ఏళ్ల వేడుకలు



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** దేశభక్తి, ఐక్యత, జాతీయ గౌరవానికి ప్రతీకగా నిలిచిన "వందే మాతరం" జాతీయ గీతం 150 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని, వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, డిపిఒ సిబ్బంది, హోం గార్డులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో అందరూ సామూహికంగా "వందే మాతరం" గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, "వందే మాతరం" గీతం భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిందని, ఈ గీతం భారత మాత పట్ల ఉన్న భక్తి, త్యాగం, దేశాభిమానానికి ప్రతీక అని తెలిపారు. అలాగే ఈ గీతం ప్రతి భారతీయుడిలో దేశభక్తిని, ఐక్యతను, జాతీయ గౌరవాన్ని మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. జాతీయ గీతం పట్ల గౌరవభావం పెంపొందించుకోవాలని, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఏఓ ఖజామోహియుద్దీన్, డీఎస్బీ ఇన్స్పెక్టర్ డీవీపీ రాజు, ఆర్ఐలు అంజాత్ పాషా, దేవిడ్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డిపిఒ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి ఎస్సే రైటింగ్ కాంపిటీషన్స్‌కు జడల పేట విద్యార్థి ఎంపిక



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** టి సాట్ మరియు గెజిటెడ్ హెచ్ఎం అసోసియేషన్ యాన్యువల్ స్టూడెంట్స్ కాంపిటీషన్ చిట్యాల మండల స్థాయి పోటీలలో జడల పేట పదవ తరగతి విద్యార్థిని శ్రీవాణి పాల్గొని జిల్లా స్థాయికి ఎంపిక అయినట్లు హెచ్ ఎం వాసంతి ప్రకటించారు. చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి పోటీలలో ఎంపిక అయిన శ్రీవాణి కి మరియు గైడ్ టీచర్ పావని కి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే వాసంతి *అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని శ్రీవాణి ని, గైడ్ టీచర్ పావని ని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# కంకర కరువాయే ఇసుక బరువాయే



- **టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్**

**చట్టం, తూప్రాన్:** ఇసుక, కంకర ధరలు అధికంగా పెరగడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలంటే ఇసుక, కంకర మేటిరియల్ ధరలు ఆకాశాన్నంటాయని మెదక్ జిల్లా తూప్రాన్ టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ ఉపాధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, టిప్పర్ అసోసియేషన్ సభ్యులు కంకర కరువాయే ఇసుక బరువాయే టన్ను కంకర ధర వెయ్యి రూపాయలు, టన్ను ఇసుక ధర 3000 రూపాయలు, ఇటుకనేమో 10 రూపాయలకు పాయె, ఇంకా ఇంకా ఇందిరమ్మ ఇల్లు కట్టేది ఎలా టాక్సీలు కట్టలేక డ్రైవర్ జీతాలు ఇయ్యలేక ఇంకా బతికేది ఎలా ఇందిరమ్మ ఇళ్లని పేదల బ్రతుకులతో ఆటలాడుతున్న ఈ ప్రభుత్వం ఉంటే ఎంత పోతే ఎంత కొండనాలికకు మందు వెడితే ఉన్న నాలుక ఊడిపోయిన చందంగా ఉన్న ఈ ప్రభుత్వం ఉంటే ఎంత పోతే ఎంత హనీ ప్రశ్నిస్తున్నారు.

# చల్లా కానుకలు అందజేసిన కార్పొరేటర్



**చట్టం / పరకాల :** వరంగల్ మహానగర పాలకసంస్థ 16వ డివిజన్ పరిధిలోని వివాహాది శుభకార్యాలకు మరియు జన్మదిన వేడుకలకు స్థానిక కార్పొరేటర్ సుంకరి. మనీషా శివకుమార్ హాజరై నూతన వధూవరులను మరియు చిన్నారులను ఆశీర్వదించి చల్లా కానుకలు అందజేశారు.

# ఐ.సి.డి.ఎస్. ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ బాల్యవివాహాలపై అవగాహన సదస్సు




**చట్టం, తూప్రాన్:** ఐ .సి.డి.ఎస్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ మరియు బాల్య వివాహాలపై అవగాహన సదస్సును మండల స్థాయిలో మరియు గ్రామస్థాయిలో ఉన్న అధికారులకూ అందరికీ అవగాహన సదస్సు నిర్వహించి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో షాలికా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఎంపీడీవో షాలిక మాట్లాడుతూ పిల్లల హక్కుల గురించి తెలియజేసి వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలి అంటే వారికి సరైన పోషకాహారం, విద్య అందించాలి అని చెప్పడం జరిగింది. ముఖ్యంగా 018 సంవత్సరాల పిల్లలు స్కూల్లోనే ఉండాలి. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలి అని చెప్పడం జరిగింది. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ శివకుమారి మాట్లాడుతూ మెదక్ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడంలో అందరి పాత్ర తప్పనిసరి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా 11 నుంచి 18 సంవత్సరాల పిల్లలందరి వివరాలు ప్రతి గ్రామంలో ఉన్న అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్తకు, పంచాయతీ సెక్రటరీలకు సమాభవన సంఘాల లీడర్లకు తెలిసి ఉండాలి అన్నారు. పట్టణ ప్రాంతంలో అయితే అంగన్వాడీ టీచర్ తో పాటు ఆశ కార్యకర్త, ఆర్పీలకు వార్డ్ ఆఫీసర్లకు కచ్చితంగా తెలిసి ఉండాలి అన్నారు. మండలం మరియు పట్టణ పరిధిలో అయితే మండల స్థాయి కమిటీలు ఎం.సి.పి.సి కమిటీలు, గ్రామస్థాయిలో అయితే వి.సి.పి.సి కమిటీలు బాలల పరిరక్షణ కొరకు పనిచేస్తాయి అని తెలియ జేయడమైనది. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే అట్టివారిపై శిక్ష తో పాటు జరిమానా విధించబడును అని తెలిపారు. అనంతరం ఏపిఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాల గురించి తెలియ జేయడం జరిగింది. ఐసిడిఎస్ సూపర్వైజర్స్ సుజాత మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల తల్లి బిడ్డల మరణలు జరుగుతాయి. లేదా పుట్టిన పిల్లలు తక్కువ బరువు పిల్లలు, తీవ్రలోప పోషణ లో వున్న పిల్లలు పుడతారు కాబట్టి బాల్యవివాహాలు చేయకూడదు అని తెలియజేశారు .ఈ కార్యక్రమానికి వచ్చిన అధికారులు అందరూ బాలలకు సంబంధించిన అన్ని చట్టాలు పై, అన్ని విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే ఈ ఈ కార్యక్రమానికి హాజరైన అందరితో తూప్రాన్ మండలంలో ఎక్కడ కూడాను బాల్య వివాహాలు జరపబోమని, ప్రోత్సహించబోమని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శాలిక, డిప్యూటీ తాసిల్దార్ శ్రీకాంత్, మెడికల్ ఆఫీసర్లు జోత్స్న దేవి, సమతా, ఏపిఎం వెంకటేశ్వర్లు, తూప్రాన్ మున్సిపల్ సీనియర్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, ఐసీపీస్ చైల్డ్ కోఆర్డినేటర్ గంగాధర్, అడ్వకేట్ బాల నరసింహులు, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, షి టీం గంగామణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు శివకుమారి, సుజాత, తూప్రాన్ మండల పరిధిలో ఉన్న మొత్తం పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ ఆఫీసర్లు, అంగన్వాడి ఆశ కార్యకర్తలు, సమ భావన సంఘాల వివో ప్రతినిధులు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## అడెల్లి పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో ఎమ్మెల్యే



**చట్టం, సారంగాపూర్:** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి పోచమ్మ ఆలయం లో శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పాల్గొన్నారు. దేవాలయం పునర్నిర్మాణం చేపట్టడం,తో మూర్తి ప్రతిష్టాపన చేయడం పట్లపట్ల శుక్రవారం నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే లను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయం లో ఎమ్మెల్యే పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ముందు నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో పాటు బిజెపి కార్యకర్తలు సారంగాపూర్ అడెల్లి పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు తదితరులు ఉన్నారు

## లాడ్జి లో కొనసాగుతున్న వ్యభిచారం

**మమత లాడ్జి యజమాని అరెస్టు**




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా గల మమతా లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారంతో పోలీసులు రైడ్ చేయగా ఇద్దరు విటులు, మహిళలతో వ్యభిచారం చేస్తూ పట్టుబడగా, కేసు దర్యాప్తులో మమతా లాడ్జి యజమాని ఉద్దేశాపూర్వకంగానే అధిక డబ్బులకు ఆశపడి లాడ్జి లోకి వచ్చే వ్యక్తులకు వ్యభిచారం చేసుకోవడానికి సహకరిస్తున్నారని తేలడంతో ఇద్దరు విటులను లాడ్జి యజమాని పై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అరెస్టు చేయబడిన నిందితుల వివరాలు ఏ1. గుజరాతి రమేష్ తండ్రి పేరు గుజరాతి గంగారం. వయసు 57 సంవత్సరాలు, పట్కరి కులానికి చెందిన మమత లాడ్జి యజమాని, నివాసం పెర్కిట్. ఏ2 శైలేష్ లింశెట్టి, తండ్రి పేరు అశోక్ లింశెట్టి, వయసు 30సంవత్సరాలు, లింగాయత్ కులానికి చెందిన కూలీ పని చేసుకునే వ్యక్తి, హంగుండా నాందేడ్, మహారాష్ట్ర వాస్తవ్యుడు. ఏ3 సదా లక్ష్మణ్ తండ్రి పేరు గంగయ్య, వయసు 26, కులం ఎస్సీ, వృత్తి డ్రైవర్, కలువ దిలావర్పూర్, ఆదిలాబాద్.

## ఇళ్ల నిర్మాణంలో వేగం... కమిషనర్ కసరత్తు..!



**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి పట్టణంలోని 7వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ శుక్రవారం స్వయంగా పరిశీలించారు. కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని ఇంకా ప్రారంభించకపోవడంతో, కమిషనర్ స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి వారి ఇళ్ల వద్దకు వెళ్లి నిర్మాణం ఆలస్యానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఇళ్ల పనులు వెంటనే ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన ఆయన, ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుని ఇళ్లను సమయానికి పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం గృహరహిత కుటుంబాల కలలను నెరవేర్చే మహత్తర కార్యక్రమమని పేర్కొంటూ, పథకాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి అని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మేనేజర్ బి. వసంతి, టీపీఓ భూపతి, బిల్ కలెక్టర్లు నరేష్, రాజు, బాలరాజు, ఏడవ వార్డు ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ బాసరలో 150వ వందేమాతర ఉత్సవాలు



**చట్టం, బాసర :** రాజీవ్ గాంధీ శాసన సాంకేతిక పరిజ్ఞాన విశ్వవిద్యాలయం ఆర్జీయూకేటీ బాసర ట్రిబుల్ ఐటీ లో శుక్రవారం ఘనంగా వందేమాతర వేడుకలను జరుపుకున్నారు. కోట్ల మంది భారతీయుల్లో స్వాతంత్ర్యోద్యమ దీప్తిని రగిలించిన 'వందేమాతరం' గేయానికి నేటితో 150 ఏళ్లు. ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తనిపెట్టింది. ఇందులో భాగంగా యావత్ భారత దేశంలోని అన్ని కార్యాలయాల్లో వందేమాతరం గీతాల నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఆర్జీయూకేటీ బాసరలో 150వ వందేమాతర ఆవిర్భావ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపకులపతి ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ మాట్లాడుతూ, ' వందేమాతరం అనేది కేవలం ఒక పదమో, గేయమో కాదని అది ఒక మహాసంకల్పమనీ పేర్కొన్నారు. స్వాతంత్ర్యము కాలంలో ఈ గేయం ప్రతి భారతీయుడిలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మ అభిమానాన్ని రగిలించిందని అన్నారు. వందేమాతరం ఏనాటికైనా స్ఫూర్తిదాయకమేనని, అది భవిష్యత్తుకు కూడాధైర్యాన్ని ఇస్తుందని ఆయన అన్నారు. బంకిం చంద్ర చటర్జీ రాసిన ఆనందమఠం నవల లోని ఈ పాట ప్రతి భారతీయునిలో భారతమాత పట్ల అచంచలమైన భక్తిని, ఆరాధనను కలుగజేస్తుందని, మనల్ని గతంలోకి తీసుకెళ్లి, మన వర్తమానాన్ని నవీనోత్తేజంతో నింపి, భవిష్యత్తును సాకారం చేస్తుందని అన్నారు'. వందేమాతరం ఈ సామూహిక గానం ప్రతి మనిషికి అద్భుతమైన అనుభవం. నిలువెత్తు భారతావనికి ఈ దేశ ప్రజలు అర్పించే గేయ సుమార్చన అని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం బోధనా, బోధినేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని, వందేమాతరం గీతాన్ని భక్తిశ్రద్ధలతో ఆలాపించారు.

## నస్కల్ లో ఉచిత మెగా వైద్య శిబిరం




**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామపంచాయతీ ఆవరణలో భారీ ఎత్తున ఇంటింటికి ఆటోతో ప్రచారం చేయించి అది కాకుండా, ఇంటింటికి వెళ్లి పలకరిస్తూ పాంప్లెంట్ పంచారు. ఈ వైద్య శిబిరానికి భారీ ఎత్తున నస్కల్ లో ఉన్న పెద్ద మనుషులందరూ తరలివచ్చారు. రోగులు కీళ్ల రోగం, బిపి, షుగర్, థైరాయిడ్ మరియు ఒళ్ళు నొప్పులు తదితర సమస్యలతో రోగులు 800 నుండి 900 దాకా భారీ ఎత్తున శిబిరం కిక్కిరిసి పోయేటట్లు జనాలు వచ్చారు వారిని కంట్రోల్ చేయని పరిస్థితి వచ్చింది. వారందరికీ డాక్టర్ మోహన్ టెస్టులు చేసి తగిన మోతాదులో మందులు ఇచ్చారు. ఈ శిబిరానికి బక్కన్న గారి ఎల్లా గౌడ్, అమరసేనారెడ్డి, సురేష్ నాయక్, తారా సింగ్, రాజు హాజరయ్యారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల భైంసాలో సామూహిక 150 వందేమాతరం గేయం



**చట్టం, భైంసా :** భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాలలోని విద్యార్థులతో కలిసి వందే మాతరం గీతం 150 ఏళ్ల లోకప్రసిద్ధి సందర్భంగా, సామూహిక వందేమాతరం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశానుసారం, కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది దేశభక్తితో నిండిన ఈ గేయాన్ని ఏకస్వరంగా ఆలపించారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ రఘునాథ్ వందేమాతరం గేయం యొక్క రచన చరిత్ర, భారత స్వాతంత్ర్య పోరాటంలో గేయం పోషించిన పాత్ర, జాతి ఏకతను పెంపొందించిన ప్రాముఖ్యత పై అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వందేమాతరం గేయం రచయిత బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ గురించి వివరించి, "ఈ గేయం ప్రతి భారతీయుడిలో దేశభక్తి జ్వాలను రగిలించే శక్తి కలిగినది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు డాక్టర్ జే భీమారావు, డాక్టర్ పి. గంగారెడ్డి, యు. రవికుమార్, డాక్టర్ శంకర్, జి.సుధాకర్, డాక్టర్ జే. ఓం ప్రకాష్, డాక్టర్ సంతోష్ కుమార్. డాక్టర్ నహీదా,డా". కల్పన. రాజయ్య, రామ్మోహన్ శ్రావణ్య. ఉజ్మా. అర్షియా. మరియు విద్యార్థులు తదితరులు.పాల్గొన్నారు.

## హోటల్ యజమాని పై దాడి నిందితులను రిమాండ్ కు తరలింపు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెర్కిట్ చౌరస్తాలో గల ఇండియన్ టీ హోటల్ కి, హోటల్ మూసివేసే సమయానికి వెళ్లిన నేరస్తులు టీ అడుగగా షాపు క్లోజ్ చేసే సమయమైందని అందుకు టీ ఇవ్వడం కుదరదని టీ హోటల్ యజమాని సద్దాం చెప్పడంతో, అతనితో గొడవపడి కక్ష పెంచుకున్న నేరస్తులు సద్దాం ను చంపాలని పథకం వేశారు. ఈ నెల 5వ తేదీన కావాలనే షాప్ క్లోజ్ చేసే సమయానికి సద్దాం హోటల్ కు వెళ్లి నేరస్తులు టి అడుగగా షాప్ క్లోజ్ చేసే సమయానికే వచ్చి ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని సద్దాం అనడంతో, ఏ1 ఇబ్రహీం, షాప్ పక్కన మూత్రం పోసి కావాలని రెచ్చగొట్టి హోటల్ యజమాని సద్దాం తో గొడవపడి అతని వెంట ఉన్న అనుచరులతో కలిసి సద్దాం, అతని షాప్ లో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కర్రలు, రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేయగా ముగ్గురికి తీవ్రమైన రక్తం కారగా తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సద్దాం అన్న, ఘటనా స్థలానికి చేరుకోగా వారిని చూసిన నేరస్తులు పారిపోయారు. హోటల్ యజమాని సద్దాం, ఇచ్చిన ఫిర్యాదు పై నేరస్తులపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఐదుగురు నిందితులను శుక్రవారం రోజు పట్టుకొని రిమాండ్ పంపినట్లు ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్, ఒక ప్రకటనలో తెలియజేశారు. మిగతా నేరస్తుల కొరకు పోలీసులు గాలిస్తున్నారన్నారు. రిమాండ్ చేసిన నేరస్తుల వివరాలు ఏ2 షేక్ అస్లాం తండ్రి పేరు రసూల్, పెర్కిట్ వాస్తవ్యుడు, ఏ3 షేక్ షెబాజ్, తండ్రి పేరు రియాజ్, పెర్కిట్ వాస్తవ్యుడు, ఏ4 మొహమ్మద్ ముజీబ్, తండ్రి పేరు మునావర్, పెర్కిట్ వాస్తవ్యుడు. ఏ5 షేక్ ఖలీల్, తండ్రి పేరు సాదిక్ సోహెబ్. అహ్మదాపుర కాలనీ, నిజామాబాద్. ప్రస్తుత నివాసం కోటార్మూర్.

## వందేమాతర గేయాన్ని ఆలపించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నేడు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వందేమాతర గేయాన్ని ఆలపించారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు మేడిసెమ్మ రాజు, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, నాయకులు జమాల్, పట్టణ నాయకులు శ్రీరామోజు నరేష్, జుట్టు దినేష్, జప ప్రసాద్, మాజీ కౌన్సిలర్ పాతర్ల గణేష్, సుంకరి రాజేష్, శ్రీకాంత్ రెడ్డి, ఉదయ్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## వందేమాతరం గేయం ఆలపించిన ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం రోజు ఈ.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, ఫౌండేషన్ సభ్యులు కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించి, తమ దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వందేమాతరం గేయాన్ని ఆలపించడం జరిగిందన్నారు. బంకించంద్ర చటర్జీ, రచించిన వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమంలో ఆంగ్లేయుల్ని తరిమికొట్టానికి కోట్ల మంది భారతీయులలో స్ఫూర్తిని నింపిందన్నారు. వందేమాతరం గేయం ప్రతి ఒక్క పౌరుని గుండెల్లో చిరస్థాయిగా మిగిలిపోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అర్గుల్ సురేష్, నరసయ్య, డిష్ రాంప్రసాద్, నూకల శేఖర్, కొండి రామచందర్, పట్టణ పద్మశాలి అధ్యక్షులు మోహన్ దాస్, సర్వ సమాజ్ సభ్యులు టాటా సాగర్, అనంతరావు, తంబాకు శేఖర్, దోమల శ్రీనివాస్, ఓం ట్రేడర్ గంగ మోహన్, ఇస్తాకుద్దీన్, పెంటి ప్రవీణ్, ఉదయ్, మహేందర్ రెడ్డి, టైలర్ వినోద్, రజినిష్, లక్ష్మ మోహన్, బాబురావు, కెవి రమణ, భాస్కర్, ఆనంద్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం గళంతో ప్రతిధ్వనించిన ఎంపీడీవో కార్యాలయం



**చట్టం / ఎల్లారెడ్డి :** జాతీయ గీతం వందేమాతరం రచనకు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎల్లారెడ్డి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం సామూహిక గీతాలాపన కార్యక్రమం దేశభక్తి ఉత్సాహంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తహేరా బేగం, ఎంపీఓ ప్రకాశ్ పాల్గొని కార్యక్రమానికి శోభ చేకూర్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో తహేరా బేగం మాట్లాడుతూ, వందేమాతరం గీతం స్వాతంత్ర్య సమరయోధులకు ప్రేరణనిచ్చిన పవిత్ర గీతం. ఈ గీతం మనలోని దేశప్రేమ, సేవాభావం, ఐక్యత భావాలను మేల్కొలిపే శక్తి కలిగినది అన్నారు. విద్యార్థులు, అధికారులు దేశాభిమానం పెంపొందించుకునేలా ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని సూచించారు. ఎంపీఓ ప్రకాష్ మాట్లాడుతూ, వందేమాతరం గీతం ప్రతి భారతీయుని గుండెల్లో గర్వాన్ని నింపుతుందని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వందేమాతరం - జైహింద్ నినాదాలతో ప్రాంగణాన్ని మార్మోగించారు.

## పలు శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్



**చట్టం, ముధోల్ :** ముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ తండా లోకేశ్వరం మండలంలోని నరసింహ నగర్ తండా గ్రామాల్లో శుక్రవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ( ఐకెపి ) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఏసిఎస్, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి ముఖ్య అతిథిగా ముధోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. అనంతరం ఎడ్ బిడ్ తండా గ్రామంలో సంత్ సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాతా నూతన అలయాల నిర్మాణనికి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్, జగదాంబ మాతా ఆలయాన్ని నిర్మిచండం సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా ఆలయ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. సేవాలాల్ మహరాజ్ సేవలను కొనియాడారు. వీరి వెంట పార్టీ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## బీర్కూరు మండలంలో ఘనంగా వందేమాతరం సామూహిక గానం



**చట్టం న్యూస్ బీర్కూర్:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలంతా ఒకేసారి సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఆ కార్యక్రమంలో భాగంగా బీర్కూరు మండల కేంద్రంలో శనివారం ఘనంగా వందేమాతరం గానం జరిగింది. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, మహిళలతో ప్రాంగణం కిక్కిరిసింది. దేశభక్తి నినాదాలతో వాతావరణం మార్మోగింది. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజల్లో జాతీయ భావాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన స్థానిక నాయకులు మరియు యువతకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా అడెల్లి మహా పోచమ్మ పునః ప్రతిష్టాపన వేడుక



**చట్టం, సారంగాపూర్ :** నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధ అడెల్లి మహా పోచమ్మ ఆలయ పునః ప్రతిష్టాపన కార్యక్రమంలో శుక్రవారం బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దంపతులు, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ లు పాల్గొన్నారు. ఆలయ ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే లకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
శనివారం
08.11.2025



# పోచమ్మని కొట్టినోడు కొసెల్లడు!

- మూర్ఖులంతా మట్టి కొట్టుకుపోతారు
- హిందూ మనోభావాలు దెబ్బతీసినోళ్లు భస్మం అయితారు
- రామగుండంలో ఔరంగజేబు పాలన సాగుతోంది
- ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి
- రామగుండం బిజెపి నేత కందుల సంధ్యారాణి

**చట్టం రామగుండం :**

పోచమ్మని కొట్టినోడు కొసెల్లడు అని గ్రామదేవతలు అయిన మైసమ్మ, వేలుపమ్మ, పోచమ్మ గుళ్లు కూల్చివేసిన నేపథ్యం లో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సంఘటనకు సంబంధించిన కారకులను తీవ్ర స్థాయిలో శపించారు రామగుండం బిజెపి మహిళా నేత కందుల సంధ్యారాణి. ఈ మేరకు శుక్రవారం కూల్చిన ఆలయాలను వారు సందర్శించారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ... గ్రామదేవతల గుళ్లను కూల్చిన మూర్ఖులంతా మట్టి కొట్టుకుపోతారు అని అన్నారు. హిందూ మనోభావాలు దెబ్బతీసినోళ్లు భస్మం అయితారు అని తెలిపారు. రామగుండంలో ఔరంగజేబు పాలన సాగు తుందని తీవ్ర ఆరోపణలు చేశారు. సంఘటనకు ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు. ఏది ఏమైనా గ్రామదేవతల గుళ్లను కూల్చడం పిచ్చి తుగ్లక్ పని అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య,జక్కన బాలు,బూడిద హర్ష,బండారి శ్యాం కుమార్,శిలారపు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.




## భూ భారతి పెండింగ్ దరఖాస్తుల డిస్పోజల్‌లో పారదర్శకతకు ప్రాధాన్యం



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** భూ భారతి చట్టం మార్గదర్శకాల ప్రకారం ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి అత్యంత పారదర్శకంగా డిస్పోజల్ ప్రక్రియ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. శుక్రవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో భూ భారతి పెండింగ్ అప్లికేషన్ల డిస్పోజల్ పురోగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు, తహసిల్దార్లు మరియు ఇతర రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులో వచ్చిన సాధబైనమా దరఖాస్తులు మరియు ఇతర సాధబైనమా అప్లికేషన్లను మండలాల వారీగా సమీక్షించి, తహసిల్దార్, ఆర్డీవో స్థాయిలలో పెండింగ్ ఉండకుండా పక్కా ప్రణాళికతో యుద్ధ ప్రాతిపదకన డిస్పోజల్ పూర్తి చేయాలని ఆదేశించారు. డేటా కరెక్షన్ మరియు ప్రజావాణి దరఖాస్తులు కూడా తక్షణం పరిష్కరించాలని సూచించారు. లాగిన్ డిస్పోజల్ కోసం సంబంధిత అప్లికేషన్లకు సంబంధించిన అన్ని హార్డ్ కాపీలను కలెక్టరేట్‌కు పంపించాల్సిందిగా ఆదేశించారు. భూ భారతి చట్టం ప్రకారం ప్రతి దశలో పారదర్శకతను పాటించడం అత్యవసరమని అన్నారు. ఇకపుడు ఆర్డీవోలు, తహసిల్దార్లు ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం ఓటరు సవరణ సర్వేను బిఎల్ఓలు, బిఎల్ఎస్‌లతో సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఎన్ఎఫ్‌బిఎస్ సర్టిఫికెట్లు కూడా ఎటువంటి పెండింగ్‌లో ఉండకుండా చూడాలని సూచించారు. అదనంగా, అవసరమైన గ్రామాల్లో అంగన్వాడి సెంటర్లు, గ్రామపంచాయతీ భవనాల కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించి కేటాయించాల్సిందిగా తహసిల్దార్లకు ఆదేశాలు ఇచ్చారు. ఈ ప్రక్రియలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం కలిగి పనిచేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో భూ భారతి అప్లికేషన్ల పరిష్కారంలో పారదర్శకత, వేగం, సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## వరి ,మొక్కజొన్న రైతులను ఆదుకోండి



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని వరిధాన్యం కొనుగోలు అక్రమాల చోటు చేసుకుంటున్నాయని వెంటనే అరికట్టాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ విక్టర్ ను శుక్రవారం మాజీ జెడ్పిటిసిలు కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే మార్క్ పేడ్ ద్వారా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఇంతవరకు ఎక్కడ కూడా కాంటాలు చేయడం లేదని వెంటనే వారి ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కాంటాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో వరి కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం 16% రాగా అదే రైస్ మిల్లులవద్దకు వెళ్లగానే 19 శాతం ఉందని ప్రతి లారీకి రైతుల వద్ద నుండి 8 నుంచి 10కింటల వడ్లను రైస్ మిల్లర్ దోపిడి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. కొనుగోలు సెంటర్లో ఉన్న తేమశాతం మిషన్ రైస్ మిల్లర్ వద్ద ఉన్న తేమ శాతం మిషన్ అధికారులు పరిశీలించాలని వారు విజ్ఞప్తి చేశారు .సదాశివ నగర్ మండలం పద్మాజివాడి సింగిల్ విండో పరిధిలో భూంపల్లి గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ ఇంతవరకు చేయడం లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు .ఈ సమస్యపై తాను ఎఫ్ సి ఐ , మార్క్ ఫైడ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు .కలెక్టర్ ను కలిసిన వారిలో నాగిరెడ్డిపేట సదాశివ నగర్ మాజీ జెడ్పిటిసిలు పడిగెల రాజేశ్వరరావు, గాంధారి మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు వజీర్ శివాజీ రావు ఉన్నారు.

## బీసీలకు 42%రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించాలి : తాటిపాముల వెంకట్రాములు



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు తక్షణం నిర్వహించకపోతే బీసీల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. వారు పేర్కొంటూ, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బీసీ ఉద్యమాల ఫలితంగా శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించి, విద్యా మరియు ఉద్యోగ రంగాలతో పాటు స్థానిక సంస్థలలో కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి పంపినప్పటికీ, ప్రభుత్వం ఆ తరువాత చర్యలు తీసుకోకుండానే చేతులు దులుపుకుందన్నారు. ముఖ్యమంత్రి అన్ని రాజకీయ పార్టీలతో మరియు బీసీ సంఘాలతో కలిసి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని చేసిన హామీ ఇప్పుడు నీటిమూట అయిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు పార్లమెంటు ఆమోదం పొందకపోతే, మరియు రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చకపోతే అమలులోకి రావు అన్న విషయం అందరికీ తెలిసినదేనని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం పాత రిజర్వేషన్ విధానాన్నే కొనసాగిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ఉందనే వార్తలు వస్తున్నాయని, 12వ తేదీన జరగబోయే కేబినెట్ సమావేశంలో ఆ నిర్ణయం తీసుకుంటే బీసీల ఆగ్రహం తారస్థాయికి చేరుతుందని హెచ్చరించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మరియు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండూ బీసీల హక్కులను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తే బీసీ సమాజం వాటికి తగిన బుద్ధి చెబుతుందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్లపై కేంద్రాన్ని ఒత్తిడికి గురి చేయాలని, బీజేపీ తన బీసీ వ్యతిరేక వైఖరిని విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే కేంద్రం, రాష్ట్రం రెండూ బీసీ ద్రోహులుగా చరిత్రలో మిగిలిపోతాయని వెంకట్రాములు స్పష్టంగా హెచ్చరించారు.

## నవంబర్ 9న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం



**చట్టం రామాయంపేట:** నవంబర్ 9 నాడు జరిగే ఎమ్మార్పీఎస్ ఎమ్ఎస్పీ అన్ని అనుబంధ సంఘాల ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశాన్ని విజవంతం చేయాలని ఎమ్ఎమ్మెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మాధవి పల్లెపాటి మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జస్టిస్ భీఆర్ గవాయ్ పై జరిగిన దాడి ఖండిస్తూ నిరసనగా నవంబర్ 9 న ఉమ్మడి మెదక్ జిల్లా మెదక్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఎమ్ఎమ్మెస్ అన్ని అనుబంధ సంఘాల సమావేశాన్ని జయప్రదం చేయాలని మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో తెలిపారు. అలాగే నవంబర్ 17వ తేదీన దళితుల ఆత్మగౌరవ మహా ప్రదర్శనను ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం



**చట్టం, ముథోల్ :** ముథోల్ మండలంలోని బోరేగాం, చింతకుంట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. బొరేగాం గ్రామంలో 14 మంది రైతుల నుండి 51 బస్తాలు, చింతకుంట గ్రామంలో ఒక రైతుల నుండి 622 బస్తాలు కొనుగోలు చేశారు. ఏ గ్రేట్ కు రూ 2389లు, కామన్ గ్రేడ్ కు రూ.2369లు క్వింటాలుకు చెల్లిస్తున్నారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, సీఈఓ సాయి రెడ్డి, డిసీవో నర్సయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**చట్టం అశ్వారావుపేట:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించేందుకు అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. వారం నుండి పది రోజులుగా తన బృందంతో కలిసి ప్రజల్లో చురుకైన ప్రచారం నిర్వహిస్తూ, ప్రతి వర్గ ప్రజలతో ఆప్యాయంగా కలిసిపోతున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో సందడి చేస్తూ, మహిళలు, యువకులు, వృద్ధులు, వ్యాపారులను ప్రేమతో పలకరిస్తూ నవ్వులు పూయిస్తూ, తన ప్రత్యేక శైలిలో ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు. పాటలతో, చమత్కారాలతో, మమకారంతో ప్రచారాన్ని ప్రజల పండుగలా మార్చారు జారే ఆదినారాయణ. ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఒక రూపాయి బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, రేషన్ కార్డులు, గృహ పథకాలు, రైతు సంక్షేమ చర్యలు —— వంటి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తున్నారు. ప్రజా మద్దతు రోజు రోజుకూ పెరుగుతుండగా, జారే ఆదినారాయణ తన బృందంతో కలిసి జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు.

## వందేమాతరం గీతం దేశ ఐక్యతకు చిహ్నం : జిల్లా కలెక్టర్ హైమావతి



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** భారత స్వాతంత్ర ఉద్యమంలో దేశంలోని అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల ప్రజలను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించింది వందేమాతరం గీతమని జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వందేమాతరం గీతం సామూహిక ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలన కాలంలో భారత ప్రజలను కులం, మతం, ప్రాంతాలవారీగా విభజించి పాలించే ప్రయత్నాలు జరిగాయి. అటువంటి సమయంలో ప్రజల్లో ఐక్యతను కలిగించేందుకు భారత కవులు, సాహితీవేత్తలు ఎన్నో ప్రయత్నాలు చేశారని అన్నారు. ఆ సందర్భంలోనే బంకిమ్ చంద్ర చటర్జీ బెంగాలీ భాషలో రచించిన ఆనందమఠం గ్రంథంలో వందేమాతరం గీతం జన్మించిందని వివరించారు. మనమంతా భూమిని తల్లిగా భావిస్తాము. అదే భావనతో భారత్ భూమిని 'మాత'గా గుర్తిస్తూ వందేమాతరం గీతం రచించబడిందని చెప్పారు. ఈ గీతం స్వాతంత్ర ఉద్యమానికి ప్రాణం పోసి, ఉత్తరం నుండి దక్షిణం వరకు, తూర్పు నుండి పశ్చిమం వరకు దేశ ప్రజల హృదయాలను ఏకం చేసిందని అన్నారు. బెంగాల్ విభజన సమయంలో జరిగిన వందేమాతరం ఉద్యమం నుండి క్విట్ ఇండియా, దండి యాత్ర వంటి ప్రధాన ఉద్యమాల వరకు ప్రతి చోటా వందేమాతరం నినాదం ప్రతిధ్వనించిందని గుర్తు చేశారు. మతం, భాష, ప్రాంతం వేరైనా మనమందరం భారతీయులమే అన్న భావనను వందేమాతరం గీతం కలిగించిందని, అది దేశప్రేమకు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. ఈ గీతం ద్వారా దేశ గౌరవం, ఐక్యత, స్ఫూర్తి నేటికీ సజీవంగా కొనసాగుతున్నాయని చెప్పారు. భవిష్యత్తు తరాలు కూడా వందేమాతరం గీతం ఔన్నత్యాన్ని స్మరించుకునేలా అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఆర్‌డీఎఫ్ పాఠశాలలో భద్రతా చైతన్య అవగాహన కార్యక్రమం



**చట్టం నారాయణరావుపేట :** సమాజంలో మహిళా భద్రతా చైతన్యం పెంపొందించేందుకు షీ టీమ్స్ సిద్దిపేట ఆధ్వర్యంలో ఆర్‌డీఎఫ్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమంలో షీ టీమ్స్ అధికారులు విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న చెడు సంఘటనలు, మొబైల్ ఫోన్ మరియు సోషల్ మీడియా దుర్వినియోగం, రోడ్డు భద్రతా నియమాలు, చెడు వ్యసనాల ప్రభావం, బాలల హక్కుల ప్రాధాన్యత వంటి అంశాలపై వివరించారు. "అమ్మాయిలు ఎవరైనా ఇబ్బందులకు గురైతే వెంటనే షీ టీమ్స్‌కి సమాచారం ఇవ్వాలి. విద్యార్థుల గోప్యతను కాపాడుతూ తక్షణ చర్యలు తీసుకుంటాం" అని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు కిషన్ పవార్, సంపత్ కుమార్, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, మమత, రజిని పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్. బాపు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో భద్రతా చైతన్యం, సామాజిక బాధ్యతా భావం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భారత్ స్కౌట్స్& గైడ్స్ మెదక్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు



**చట్టం మెదక్ ప్రతినిధి :** కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ మెదక్ జిల్లా DEO రాధాకిషన్ MJP బీసీ గురుకులాల మెదక్ జిల్లా RCO J.రాజేశం DSO రాజిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మెదక్ పట్టణంలోని కొత్త బస్టాండ్ నుండి రాందాస్ చౌరస్తా వరకు జరిగింది. తర్వాత మహాత్మా జ్యోతిభాపూలే బీసీ గురుకుల పాఠశాలలో స్కౌట్స్ & గైడ్స్ విద్యార్థులకు క్యాంపింగ్ టెస్ట్ జరుపగా విద్యార్థులు వేసిన గూడారాలను పరిశీలించి స్కౌట్స్ గైడ్స్ శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెదక్ జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్ సర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రేంజర్స్ కమిషనర్ శ్రీజన డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ ఇప్ప రాజేందర్, డిస్ట్రిక్ట్ DOC లు తలారి నాగరాజు బట్టి జ్యోత్స DTC కుల్ల మహిపాల్, స్కౌట్స్ మాస్టర్స్ గైడ్ మాస్టర్స్,లైబ్రేరియన్ బుర్ర సంతోష్ ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పలు మండలాల్లో రెండు రోజుల విద్యుత్ అంతరాయం



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా పరిధిలోని మెదక్, హవేలీ ఘనపూర్, చిన్నశంకరంపేట, పాపన్నపేట మండలాల్లో రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్, తీగల మార్పులు, ట్రీ కటింగ్ వంటి పనులు చేపట్టనున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో (శనివారం, ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మెదక్ పట్టణం, మెదక్, హవేలీ ఘనపూర్, చిన్నశంకరంపేట, పాపన్నపేట మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. సబ్‌స్టేషన్లలో జరుగుతున్న మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు, పాత తీగల మార్పులు, చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనుల కారణంగా ఈ తాత్కాలిక అంతరాయం అవసరమైందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖ ఏడీఈ మోహన్‌బాబు, ఏఈలు నవీన్, రాజ్‌కుమార్, దినకర్, నర్సింలు సంయుక్తంగా ఇచ్చిన ప్రకటనలో ప్రజలకు, రైతులకు ఈ విషయమై ముందస్తు అవగాహన కల్పించారు. ఈ రెండు రోజులపాటు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందనే విషయాన్ని గమనించి ప్రజలు, రైతులు సహకరించాలని వారు అభ్యర్థించారు. విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. "ప్రజలకు మరింత స్థిరమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే మా ప్రధాన లక్ష్యం. అందుకే అవసరమైన సాంకేతిక పనులను తక్షణమే పూర్తి చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నాం" అని పేర్కొన్నారు.

## మద్యం దొరకక మందుబాబుల పరేషాన్



**చట్టం బీబీపేట్ :** బీబీపేట్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెండు మద్యం షాపుల్లో మద్యం అందుబాటులో లేక మందుబాబులు ఆందోళన చెందడంతో పాటు విలవిలలాడుతున్నారు. సుమారు గత నెల రోజులుగా వినియోగదారులకు కావలసిన బ్రాండ్లు అందుబాటులో లేక కేవలం చీఫ్ లిక్కర్ లాంటివి మాత్రమే విక్రయించుచడంతో మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట్ , సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణాలకు వెళ్లి మద్యం కోసం పరుగెత్తాల్సి వస్తుందని ఈ ప్రాంతవాసులు వాపోతున్నారు. మద్యం టెండర్ల ప్రక్రియ ప్రారంభం నుండి ఈ సమస్య తలెత్తిందని కొందరు వివరించగా ఇంకా ఈనెల ఈ నెలాఖరు వరకు విక్రయాలు జరపాల్సి ఉండగా నిర్వాహకులు కావాల్సిన బ్రాండ్లు విక్రయించడం లేదని కేవలం చీఫ్ లిక్కర్లతోనే విక్రయాలు సరిపెడుతున్నారని, ఫలితంగా వినియోగదారులు ఇబ్బందులకు గురికావడమే కాకుండా అనేక ప్రయాసాలకు గురై దూర ప్రాంతాల నుండి మద్యం కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని ఈ ప్రాంత వాసులు. ఈ ప్రాంత వినియోగదారులు వాపోతున్నారు. ఈ విషయంలో విక్రయదారులను ప్రశ్నించగా వైన్స్ యజమానులకే తెలుసని తమకేమీ పట్టనట్టు తలతిక్క సమాధానాలు ఇస్తున్నారని వినియోగదారులు పేర్కొన్నారు. వినియోగదారులకు కావాల్సిన బ్రాండ్లు అందుబాటులో ఉంచాల్సిన ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి .నిన్న మొన్నటి వరకు మందు అధిక సంఖ్యలో విక్రయాలను ప్రోత్సహించిన ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. మొన్నటి వరకు ప్రతి బెల్ట్ షాపులో విచ్చలవిడిగా ప్రతి బ్రాండ్ అందుబాటులో ఉండేదని ప్రస్తుతం చీఫ్ లిక్కర్ మాత్రమే అందుబాటులో ఉంటుందని మద్యం ప్రియులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి వినియోగదారులకు కావలసిన అన్ని మద్యం బ్రాండ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత మద్యం వినియోగదారులు కోరుతున్నారు.

## రాముని పేరుతో ఉన్న రామగుండం లో రాక్షసుల పాలన



**చట్టం రామగుండం :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్ధరాత్రి దొంగతనంగా గ్రామదేవతలైన మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ వంటి దేవతల గుళ్లను కూలగొట్టడం ప్రాంతమంతా కలకలం రేపింది. స్థానిక ప్రజలు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హిందూ ఆరాధనా స్థలాలపై ఇలాంటి చర్యలు విశ్వాసాలను దెబ్బతీసే దుష్టప్రయత్నమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారతీయ జనతా పార్టీ ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. పార్టీ ప్రతినిధులు తెలిపారు – మున్సిపల్ పరిధిలో సుమారు 50కు పైగా గ్రామదేవత గుళ్లు రాత్రి పూట ఎటువంటి నోటీసు లేకుండా కూలగొట్టడం హేయమైన చర్య అని, దీనికి బాధ్యులైన వారిని తక్షణమే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కూల్చివేయబడిన గుళ్లను వెంటనే పునర్నిర్మించాలని కోరారు. ప్రజా భావాలను అవమానపరిచే ఈ దుర్మార్గపు చర్యల వెనుక రాజకీయ కుట్ర ఉందని అనుమానం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హిందూ దేవాలయాలపై దాడులు, అవమానకర చర్యలు పెరిగాయని ప్రజలు చెబుతున్నారు. బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. "ఈ ఘటన ప్రజల మనోభావాలపై దెబ్బ. ప్రభుత్వ ధర్మం ప్రజల విశ్వాసాలను కాపాడడం. కూల్చివేత చేసిన అధికారులను, బాధ్యులను తక్షణమే సస్పెండ్ చేసి, దేవాలయాలను పునర్నిర్మించడం ద్వారా ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు. రామగుండం ప్రాంతంలో ప్రస్తుతం ప్రజలు గుళ్ల వద్ద దీపాలు వెలిగించి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. భక్తులు ఈ చర్యను దేవతల అవమానంగా భావిస్తూ, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు మత సామరస్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని సామాజిక వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ప్రజల ఆరాధనా స్థలాలను కూలగొట్టడం అభివృద్ధి పేరుతో జరిగినా, ప్రజా మనోభావాలను గౌరవించాల్సిన అవసరం ఉందని వారు గుర్తు చేస్తున్నారు.

## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బిఎస్జి) వ్యవస్థాపక దినోత్సవం



**చట్టం రామగుండం :** స్థానిక ఆర్.సి.ఓ.ఏ క్లబ్ దగ్గర బెడెన్ పావెల్ పార్క్ వద్ద భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బిఎస్జి) వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 7 వ తేదిని పురస్కరించుకుని రవీందర్ రెడ్డి పర్సనల్ మేనేజర్ ముఖ్య అతిథిగా హాజరై మొదట భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బిఎస్జి) జెండా ఎగుర వేసారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ మెడలో ధరించె స్కార్ఫ్ లను ఆవిస్కరించి అందజేశారు. ఇదే సందర్భంగా (బిఎస్జి) వ్యవస్థాపక దినోత్సవ ప్రత్యేక స్టిక్కర్స్ ను కూడా వివిధ పాటశాలల నుండి వచ్చిన విద్యార్థులకు పంపిణి చేసారు. ఈ సందర్భముగా ముఖ్య అతిథి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... ఈ రోజు ను 1950 లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ను స్థాపించబడిన రోజును ప్రపంచ చరిత్రలో బెడెన్ పౌల్ ఒక నూతన ఒరవడిని స్థాపించి ప్రపంచ వ్యాప్తంగా నిస్వార్థ సేవలో ఎందరికో స్ఫూర్తి ప్రధాతగా నిలిచారని, దేశ సేవాలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎనలేని సేవా చేస్తూ వారి సేవలను మరువలేనివని కొనియాడారు. ఈ సందర్భముగా స్కౌట్ అండ్ గైడ్ లకు శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమములో రోవర్ స్కౌట్ మాస్టర్స్ కె.బుచ్చయ్య, ఎ. దేవందర్, డి. కుమార్, స్వర్ణలత, లక్ష్మి కుమారి, రాజయ్య, జి. కుమార్, సెయింట్ ఫాల్స్ హై స్కూల్, సింగరేణి పాటశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల ప్రశంసలు పొందుతున్న బాసర జ్ఞాన సరస్వతి ఆలయ సిబ్బంది





**చట్టం, బాసర** : పవిత్ర పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో గత రెండు రోజులుగా భక్తుల విలువైన వస్తువులు పోగొట్టుకున్న ఘటనల్లో ఆలయ సిబ్బంది తమ నిజాయితీతో ఆదర్శంగా నిలిచారు. భక్తులు మరచిపోయిన మొబైల్ ఫోన్లు, నగదు, బంగారు ఉంగరం వంటి విలువైన వస్తువులను గుర్తించి తిరిగి భక్తులకే అందజేయడంతో, ఈ సిబ్బంది భక్తులతో పాటు ఆలయ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన సావిత్ర భాయి మొబైల్ ఫోన్, ₹1000 నగదు, హ్యాండ్ బ్యాగ్ ఆలయం వద్ద మర్చిపోయారు. అదే సమయంలో హైదరాబాద్‌కు చెందిన మరో భక్తుడు ప్రవీణ్ అక్షరాభ్యాస మండపంలో తన బంగారు ఉంగరం పోగొట్టుకున్నారు. ఈ వస్తువులను విధుల్లో ఉన్న ఆలయ వాగ్దేవి సొసైటీ సిబ్బంది రాజు, హోంగార్డులు ఇందల్, నారాయణ గుర్తించి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కి అప్పగించారు. అనంతరం వారిని సంప్రదించి భక్తులకు తిరిగి అందజేశారు. ఇక గురువారం నాడు నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌కు చెందిన ఓ భక్తురాలు ₹20,000 విలువైన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా, అదే రోజు ఎడిపల్లి మండలం పెంటకలన్ గ్రామానికి చెందిన శిరీష అనే మహిళ ₹10,000 విలువైన చరవాణి కోల్పోయారు. ఈ రెండూ ఘటనల్లో కూడా ఎన్ఎమ్ఆర్ సాయి, సీసీ కెమెరా ఆపరేటర్ సాయిలు, హోంగార్డ్ వెన్నెల సత్వరమే గుర్తించి భక్తులకు తిరిగి అందజేశారు. తమ నిజాయితీతో ఆలయ ప్రతిష్ఠను మరింతగా పెంచిన ఈ సిబ్బంది కృషి పట్ల భక్తులు, ఆలయ అధికారులు, స్థానిక గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు.

